
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శుక్రవారం 22 మార్చి 2024


నరసరావుపేట మండలం ములకలూరులో ఏడాదిగా పునాదులు దాటని తరగతి గది నిర్మాణం

అందుబాట్లో లేని.. ఆర్‌వోలు



- నియోజకవర్గాలకు చుట్టపుచూపుగా రాక
- కోడ్ అమల్లోకి వచ్చినా ఇంకా పాత ధోరణే
- జిల్లా కేంద్రాల్లోనే ఎక్కువ సమయం విధులు
- పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలు
- ఏఈఆర్‌వోలపై అధికార పార్టీ నేతల కర్ర పెత్తనం
- సకాలంలో నిర్ణయాలు తీసుకోలేకపోతున్న అధికారులు

గుంటూరు, మార్చి 21 (ఆంధ్ర జ్యోతి): ఆర్‌వో.. రిటర్నింగ్ ఆఫీసర్. ఎన్నికల్లో వీరిదే కీలకపాత్ర. షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికలకు సంబంధించి అన్నీ వీరే చూడాలి. కోడ్ అమలు నుంచి అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత.. ఎన్నికల సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత వీరిదే. ఇంతటి కీలక బాధ్యతల్లో ఉన్న కొందరు ఆర్‌వోలు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఆయా నియోజకవర్గాలకు చుట్టపు చూపుగా వెళ్లి వస్తున్నారన్న విమర్శలున్నాయి. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోనే నివాసం ఉంటూ కోడ్ అమలుని పర్యవేక్షిస్తూ ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన వారు ఎక్కువ సమయం జిల్లా కేంద్రాల్లోనే ఉంటున్నారు. చివరకు ఎన్నికల సంఘం రాష్ట్ర ఉన్నతాధికారి ముఖేష్‌కుమార్ మీనా నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లకు కూడా కలెక్టరేట్ల నుంచే కొందరు హాజరౌతున్నారు. దీంతో కోడ్ అమలు చేసే భారం తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లపై పడుతోంది. వీరిపై స్థానికంగా ఉండే నాయకులు పెత్తనం ఎక్కువగా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో వారు సరైన నిర్ణయాలు తీసుకోలేక పోతున్నారు. ఇదే అవకాశంగా పలు ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులు చెలరేగిపో తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా విభజన జరిగి దాదాపుగా రెండేళ్లు పూర్తి కావొస్తున్నా చాలామంది గుంటూరులోనే నివాసం ఉంటూ ఇక్కడి నుంచి వారి పని ప్రదే శాలకు వెళ్లి వస్తున్నారు. సాధారణ రోజుల్లో అంటే పెద్దగా పరిపాలనపై ప్రభావం ఉండదు. అయితే కోడ్ అమల్లోకి వచ్చిన సమయంలోనే పలువురు అదే వైఖరిని అవలంబిస్తున్నారు. ప్రత్తిపాడు, పొన్నూరు, మంగళగిరి, తాడికొండ ఆర్‌వోలు ఇక్కడే ఎక్కువ సమయం ఉంటున్నారు. బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని నియోజకవర్గాల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్‌వోలలో కూడా కొందరు గుంటూరులోనే ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో కోడ్ సరిగా అమలు కావడం లేదని సమాచారం. షెడ్యూల్ విడుదల అయిన తరువాత జిల్లా అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లోనే సీఈవో ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ.. ఆర్‌వోలు ఆఫీసుల్లో కూర్చోవడం కాదు... క్షేత్రస్థాయికి వెళ్లాలి.. కోడ్ అమలుపై చర్యలు తీసుకోవాలని గట్టిగా హెచ్చరించారు. ఈ పరిస్థితికి కారణం పలువురు జిల్లా కేంద్రాలను దాటకపోవమేనని పలువురు చర్చించుకుంటున్నారు.

2019లో ఇలానే చేయగా...

2019 ఎన్నికల సమయంలోనూ కొంతమంది ఆర్‌వోలు ఇలానే చేయగా అప్పటి కలెక్టర్ కోన శశిధర్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఆర్‌వో అయినా నియోజకవర్గం కేంద్రంలోనే ఉండాలని, వీడియో కాన్ఫరెన్స్‌లకు కూడా అక్కడి నుంచే హాజరు కావాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. దాంతో అప్పట్లో నరసరావుపేట లోక్‌సభ రిటర్నింగ్ అధికారి కార్యాలయం గుంటూరు కలెక్టరేట్ నుంచి నరసరావుపేట ఆర్డీవో కార్యాలయానికి మార్చారు. అప్పటి జేసీ హిమాన్షు శుక్లా నిత్యం అక్కడికే వెళ్లి సమావేశాలకు హాజరయ్యేవారు. ఇప్పుడు కూడా అధికారులు అలాంటి చర్యలు తీసుకోకపోతే సీఈవో ఆగ్రహానికి గురికాక తప్పదు.

నాడు నేడు.. పనులు నత్తేనయం అన్నట్లుగా సాగుతున్నాయి. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన మాటేమో కాని విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. నిధులు రాక ఎక్కడికక్కడే పనులు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల తరగతి గదులు నిర్మాణ సామగ్రితో నిండిపోగా, విద్యార్థులకు తరగతులను ఆరుబయట చెట్ల కింద నిర్వహిస్తున్నారు. రెండో విడతలో చేపట్టిన పనులు ముందుకు సాగడంలేదు. పనుల పూర్తిపై నిర్లక్ష్యం తాండవిస్తోంది. అధికారులు సమీక్షలతో సరిపుచ్చుతున్నారు. విద్యాసంవత్సరం ముగియనున్నా పాఠశాలల్లో నాడు నేడు పనులు ఒక కొలిక్కి రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మొత్తం మీద నాడు నేడు పనులపై పాలకుల చిత్తశుద్ధి లోపంతో పురోగతి అంతంతమాత్రంగానే ఉంది.


నరసరావుపేట మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏడాదిగా నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

నాడు నేడుకు.. నిధుల గండం

- పనులు నత్తనడకతో పోటీ
- విద్యా సంవత్సరం ముగుస్తున్నా పూర్తికాని పనులు
- వసతులు లేక విద్యార్థుల ఇక్కట్లు
- గదులు చాలక ఆరుబయట తరగతులు
- మూడు జిల్లాల్లో 3138 పాఠశాలల్లో పనులు
- నిధులు మంజూరు రూ.699.28 కోట్లు
- విడుదల రూ.348.06 కోట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అమలు చేస్తున్న నాడు నేడు పథకం రెండో విడతలో చేపట్టిన పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. నిధులు కొరత వెంటాడుతోంది. పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులకు నిధులు విడుదల కావడంలేదని పాఠశాలల పేరెంట్స్ కమిటీలు చెబుతున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రెండో విడతలో 3,138 పాఠశాలల్లో పనులు చేపట్టారు. ఇందుకు రూ.699.28 కోట్లు నిధులు మంజూరు చేసినట్టు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కానీ 348.06 కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. నిధులు సకాలంలో విడుదల కాకపోతుండటంతో పేరెంట్స్ కమిటీలు పనులను నిలిపివేశాయి. స్కూల్స్‌లో మౌలిక వసతులు కల్పించక పోవడంతో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు.

మున్సిపాల్టీల పరిధిలోని పాఠశాలల్లో పబ్లిక్ హెల్త్ శాఖ, గ్రామాల్లోని పాఠశాలల్లో పంచాయతీరాజ్, ఏపీఈడబ్ల్యూఐడీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, సమగ్ర శిక్ష శాఖల పర్యవేక్షణలో పనులు చేపట్టారు. మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్, తాగునీటి వసతి, ఫర్నిచర్, మేజర్, మైనర్ మరమ్మతులు, తరగతి గదులు, ప్రహరీల నిర్మాణం, గ్రీన్ చాక్ బోర్డులు, ఇంగ్లీషు ల్యాబ్‌లు, భవనాలకు రంగులు వేసే పనులు చేపట్టారు.

ఉన్న గదులు కూల్చేశారు..

నిధుల లేమితో పాఠశాలల్లో పనులు ఇప్పట్లో పూర్తయ్యేలా లేవు. పాఠశాలల్లో ఉన్న తరగతి గదులను కూల్చివేశారు. నూతన గదులు నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు తరగతి గదుల సమస్యను ఎదుర్కొంటున్నారు. నిధులు విడుదల చేయడంలో జాప్యంతో సొంత డబ్బుతో పనులు చేసేందుకు కమిటీలు ముందుకు రావడంలేదు. పనులు చేసి బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పాఠశాలల తల్లిదండ్రుల కమిటీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నెలల తరబడి నిధులు విడుదల కాకపోవడంతో పనులను పూర్తిగా నిలిపివేశారు. ఇప్పట్లో నిధులు విడుదల అయ్యేలా లేవని అధికారులు చెప్పకనే చెబుతున్నారు.

బాపట్ల జిల్లా...

బాపట్ల జిల్లాలో 943 పాఠశాలల్లో పనులు చేపట్టారు. రూ.183.31 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేయగా ఇప్పటికి రూ.88.35 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తయ్యాయి. పాఠశాలల్లో 6,265 పనులు చేపట్టారు. వీటిలో 4,099 పనులు పురోగతిలో ఉన్నాయి. 2,105 పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. 112 పాఠశాలల్లో 272 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. 11 గదుల నిర్మాణం పూర్తి చేశారు. 326 స్కూల్స్‌లో మరుగుదొడ్ల బ్లాక్‌ను నిర్మించడం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టడం వంటి పనులను చేపట్టగా 153 చోట్ల పనులు పూర్తయ్యాయి. 78 పాఠశాలలకు ప్రహరీ నిర్మాణ పనులను మంజూరు చేశారు. వీటిలో ఐదు పనులు పూర్తయ్యాయి. విద్యుత్ సరఫరా కోసం 326 పనులు చేపట్టగా 76 పనులు పూర్తయ్యాయి. మరమ్మతుల పనులు 745 చేపట్టగా 167 పనులను పూర్తి చేశారు.

గుంటూరు జిల్లా..

గుంటూరు జిల్లాలో 914 పాఠశాలల్లో పనులు చేపట్టారు. రూ.203.94 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేయగా ఇప్పటికి రూ.107.52 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తయ్యాయి. 914 పాఠశాలల్లో 6,476 పనులు చేపట్టారు. వీటిలో 3,778 పనులు పురోగతిలో ఉన్నాయి. 2,446 పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. 75 పాఠశాలల్లో 244 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. తొమ్మిది మాత్రమే అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేశారు. 394 స్కూల్స్‌లో మరుగుదొడ్ల బ్లాక్‌ను నిర్మించడం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టడం వంటి పనులను చేపట్టారు. వీటిలో 190 స్కూల్స్‌లో పనులు పూర్తయ్యాయి. పనులు పూర్తికాక అనేక స్కూల్స్‌లో మరుగుదొడ్ల వసతి సరిగాలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 100 పాఠశాలలకు ప్రహరీ నిర్మాణ పనులకు గాను 24 స్కూల్స్‌లో పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కోసం 397 పనులు చేపట్టగా 163 పనులు పూర్తయ్యాయి. మరమ్మతుల పనులు 745 చేపట్టాగా 120 పనులను పూర్తి చేశారు.

పల్నాడు జిల్లాలో ...

పల్నాడు జిల్లాలో 1,281 స్కూల్స్‌లో ఆయా పనులు చేపట్టారు. రూ.312.03 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేయగా ఇప్పటికి రూ.152.19 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఐదు ప్రభుత్వం శాఖలకు పనులు అప్పగించారు. 1301 పాఠశాలల్లో 8,349 పనులు చేపట్టారు. వీటిలో 5,217 పనులు పురోగతిలో ఉన్నాయి. 3,127 పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. స్కూల్స్‌లో 174 ప్యాకేజీల కింద 759 అదనపు తరగతి గదుల నిర్మాణం మంజూరు చేశారు. అయితే 25 మాత్రమే అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయినట్టు సంబంధిత శాఖల లెక్కలు తెలియజేస్తున్నాయి. పాఠశాలల విలీనంతో తరగతి గదులు చాలక విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. గదుల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 547 స్కూల్స్‌లో మరుగుదొడ్ల బ్లాక్‌ను నిర్మించడం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టడం వంటి పనులను చేపట్టాలి. 139 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. అనేక స్కూల్స్‌లో మరుగుదొడ్ల వసతి సరిగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 91 పాఠశాలలకు ప్రహరీ నిర్మాణం చేపట్టగా 27 పాఠశాలల్లో పనులు పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కోసం 553 పనులు చేపట్టగా 216 పనులు పూర్తయ్యాయి. మరమ్మతుల పనులు 913 చేపట్టగా 265 పనులను మాత్రమే పూర్తి చేశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.24(శుక్రవారం)
సహారీ (ఉదయం) 4.54 (శనివారం)

రథాలు.. రెడీ

- ఎన్నికల ప్రచార రథాలకు కేరాఫ్ చిలకలూరిపేట

చిలకలూరిపేట, మార్చి 21: ఎన్నికల ప్రచార రథాలు.. అయితే చలో చిలకలూరిపేట! కేరళ, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల నుంచి ఎన్నికల ప్రచార రథాల కోసం అభ్యర్థుల అనుచరులు పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు తరలివస్తున్నారు. ఇక్కడ ఏ పార్టీకి చెందిన అభ్యర్థులకైనా ప్రచార రథాలను నాలుగైదు రోజుల్లో తయారుచేసి ఇస్తున్నారు. అభ్యర్థులకు నచ్చేరీతిలో వాహనాలకు పెయింటింగ్, స్టిక్కరింగ్ చేస్తున్నారు. దీనికి తోడు జనరేటర్, లైటింగ్, మైక్ సిస్టం కూడా వాహనానికి అమర్చి ఇస్తున్నారు. అభ్యర్థులు సులభంగా వాహనాలు ఎక్కేందుకు వీలుగా వెనుక వైపు మెట్లు తయారుచేసి మెట్లపై మ్యాట్ కూడా వేసి ఇస్తున్నారు. అభ్యర్థులు వారి వారి నియోజకవర్గాల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా సులువుగా ప్రచారం చేసేందుకు వీలుగా ఈ రథాలను సిద్ధం చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల బరిలోకి దిగిన అభ్యర్థులకు ఇప్పటికే సుమారు 60 వాహనాలు ఇక్కడ సిద్ధం చేసి ఇచ్చారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో సుమారు 35 వాహనాలు ఇక్కడే తయారుచేసి ఇచ్చారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా ప్రచార రథాల కోసం ఇక్కడికి బారులు తీరుతున్నారు. కేరళలో బీజేపీ తరపున ఎన్నికల్లో పోటీ చేయబోతున్న కేంద్రమంత్రి వి.మురళీధరన్ ప్రచార రథాన్ని ఇప్పటికే ఇక్కడ సిద్ధం చేశారు. ఆ రథానికి మలయాళం భాషలో స్టిక్కరింగ్ చేశారు. నారా లోకేష్ (తెలుగుదేశం), అవినాష్ రెడ్డి (వైసీపీ, కడప) లోకం మాధవి (జనసేన, నెల్లిమర్ల, విజయనగరం) మాగుంట (తెలుగుదేశం, ఒంగోలు) తదితరుల ప్రచారరథాలు ఇక్కడ సిద్ధమయ్యాయి.





ముస్తాబైన ఎన్నికల ప్రచార రథాలు





ఈ ప్రచార రథాల రూపకర్త చిలకలూరిపేటకు చెందిన షేక్ కరిముల్లా. ఆటోలు, మినీ వాహనాలకు బాడీ బిల్డింగ్ చేయడంలో, గ్రిల్స్ కట్టడంలో ఆయనకు 25 సంవత్సరాల అనుభవం ఉంది. చిలకలూరిపేటలోని జాతీయ రహదారిపై ఏఎంజీ పక్కన కరీముల్లా ఆర్క్ వెల్డింగ్ వర్క్స్ పేరుతో ఈ యువకుడు ఏర్పాటుచేసిన షెడ్డులో ఎన్నికల ప్రచార రథాలు ముస్తాబవుతున్నాయి. ఈ సందర్భంగా ప్రచార రథాల గురించి వివరిస్తూ కరీముల్లా ఇప్పటివరకు అన్ని పార్టీలకు సంబంధించిన సుమారు 100 ప్రచార రథాలను సిద్ధం చేసి ఇచ్చాము. ఇప్పుడు మా చేతిలో మరో 10 ప్రచార రథాలకు ఆర్డర్లు ఉన్నాయి. ఒక్కో ప్రచార రథాన్ని అన్ని రకాలుగా ముస్తాబు చేసి ఇవ్వడానికి సుమారు రు.4.5 లక్షలు ఖర్చు అవుతుంది. వాహనాలను మాత్రం అభ్యర్థులే తమకు నచ్చిన కంపెనీల నుంచి కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. ముఖ్యంగా ఇసుజు, బొలెరో వాహనాలను అభ్యర్థులు తీసుకువస్తున్నారు."


షేక్ కరీముల్లా

ఓట్ల లెక్కింపు కోసం
జేఎన్‌టీయూ పరిశీలన

నరసరావుపేట, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాటు కోసం కాకాని వద్ద ఉన్న జేఎన్‌టీయూ కళాశాలను కలెక్టర్ శివశంకర్ గురువారం పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటును పరిశీలించి సంబంధిత అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ శ్యాంప్రసాద్, ఆర్‌డీవో సరోజ తదితరులు పాల్గొన్నారు.


కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం జేఎన్‌టీయూ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శివ శంకర్

ఖర్చులకు అభ్యర్థే లెక్కలు చూపాలి

శాసనసభ, లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో పెట్టే ప్రతీ రూపాయి ఖర్చుకు సంబంధించి లెక్కలు అప్పచెప్పాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివ శంకర్ తెలిపారు. ఎన్నికల ఖర్చులకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల పరిశీలనకు అధికారులను ప్రత్యేకంగా నియమించామన్నారు. నామినేషన్ సమయంలో ప్రతీ అభ్యర్థికి ఒక బుక్ ఇస్తామని అందులో ఖర్చులు రాయాలన్నారు. అభ్యర్థులకు తెలియకుండా ఎవరైనా సమావేశాలు, కార్లు, ర్యాలీలు, ఇళ్లపై జెండాలు ఏర్పాటుచేసినా అవన్నీ అభ్యర్థుల లెక్కల్లోకి వస్తాయన్నారు. అసెంబ్లీ అభ్యర్థి అత్యధికంగా రూ.40 లక్షలు, లోక్‌సభ అభ్యర్థి రూ.95 లక్షల వరకు ఖర్చు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో డీఆర్వో వినాయకం, పోలీస్ అధికారి శ్రీనివాస్‌నాయక్, జిల్లా రవాణా శాఖ అధికారి పరంధామరెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ అధికారి రామకృష్ణనాయక్, డీసీవో నారాయణస్వామి, ఖర్చుల నమోదు అధికారి బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంచాలి

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో నిఘా పకడ్బందిగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద నిఘాపై ఆయన గురువారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు-3, సరిహద్దు చెక్‌పోస్టులు-6, ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్‌పోస్టులు-16 ఉన్నాయని వాటి వద్ద అవసరమైన సిబ్బందిని త్వరితగతిన నియమించాలన్నారు. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న సామగ్రి, నగదులను స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచాలన్నారు.

ఓట్లేయండి.. రోడ్డేస్తాం..
- ఓటర్లను ప్రభావితం చేసేందుకే వైసీపీ నేతల యత్నం

కోడ్ ఉందంటూ నీటి సరఫరా నిలిపివేత

7 లో..

మా ఊపిరి అమరావతి
- 1556వ రోజుకు రైతుల ఆందోళన

అరుణాచలంనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ధనాధన్‌కు సిద్ధమా!

నేటి నుంచే ఐపీఎల్ 17వ సీజన్

చెన్నై × బెంగళూరు మధ్య ఆరంభ పోరు

రాత్రి 8.00 నుంచి స్టార్‌స్పోర్ట్స్, జియో సినిమాలో..

మహి కల ప్రీమియర్ లీగ్ ముగిసిందో.. లేదో.. అంతకు మించిన వినోదం రెడీగా ఉంది. 16 ఏళ్లుగా వన్నె తరగని రీతిలో అంతకంతకూ ఆకర్షణ పెంచుకుంటూ వస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్‌కు తెర లేవనుంది. ఇక రెండు నెలల పాటు బ్యాటర్ల బాదుడు.. ఫీల్డర్ల మెరుపు విన్యాసాలు.. బౌలర్ల అబ్బురపరిచే బంతులను ఈ క్రేజీ లీగ్‌లో మైమరిచి చూసేందుకు క్రికెట్ ప్రేమికులంతా సిద్ధంగా ఉండాల్సిందే. అలాగే రానున్న టీ20 వరల్డ్‌కప్‌లో బెర్త్ దక్కించుకునేందుకు యువ ఆటగాళ్లతో పాటు వెటరన్స్‌కు కూడా ఈ లీగ్ కీలకమే. దీనికి తోడు డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్-రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య బ్లాక్‌బస్టర్ మ్యాచ్‌తో ఆరంభమే ఘనంగా ఉండబోతోంది.

చెన్నై సారథి రుతురాజ్



ఇదే ఆఖరు!

కెప్టెన్సీ వదిలేసిన ధోనీ
సీజన్‌లో ఆడతాడు : కోచ్ ఫ్లెమింగ్

చెన్నై: ఐపీఎల్ ఆరంభానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్ సారథి ధోనీ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. 16 ఏళ్లుగా ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా పేరు తెచ్చుకున్న ఎంఎస్ ధోనీ అనూహ్యంగా నాయకత్వ బాధ్యతలనుంచి వైదొలుతున్నట్టు ప్రకటించాడు. దీంతో ఇక నుంచి యువ ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ జట్టును నడిపిస్తాడని సీఎస్కే వెల్లడించింది. లీగ్ ఆరంభానికి సరిగ్గా ఒకరోజు ముందు, ఎలాంటి ఊహాగానాలు లేకుండానే వెలువడిన ఈ వార్త అటు సీఎస్కే అభిమానులతో పాటు క్రికెట్ ప్రేమికులను కూడా షాక్‌లో ముంచింది. 'ఎంఎస్ ధోనీ తన కెప్టెన్సీని రుతురాజ్‌కు అప్పగించాడు. 2019 నుంచి గైక్వాడ్ జట్టులో భాగంగా ఉంటూ 52 మ్యాచ్‌లు ఆడాడు. అతడి నాయకత్వంలో జట్టు రాణిస్తుందని ఆశిస్తున్నాం' అని సీఎస్కే పేర్కొంది. శుక్రవారం జరిగే ఆరంభ మ్యాచ్‌లో సీఎస్కే జట్టు రుతురాజ్ నేతృత్వంలోనే రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో ఆడనుంది. అయితే 27 ఏళ్ల రుతురాజ్‌కు కెప్టెన్‌గా చేయడం ఇదేం తొలిసారి కాదు. 2023 ఆసియా గేమ్స్‌లో భారత క్రికెట్ జట్టు అతడి ఆధ్వర్యంలోనే స్వర్ణం సాధించింది. దేశవాళీల్లో మహారాష్ట్ర జట్టుకు కూడా తనే కెప్టెన్. అలాగే గతేడాది తమ ఫ్రాంచైజీని చాంపియన్‌గా నిలపడంలో బ్యాటర్‌గా రుతురాజ్ పాత్ర కీలకం. ఆడిన 16 మ్యాచ్‌ల్లో 147.50 స్ట్రయిక్ రేట్‌తో 590 పరుగులు చేశాడు. వాస్తవానికి 2019లో జట్టులోకి వచ్చిన రుతురాజ్ పూర్తిగా బెంచీకే పరిమితమయ్యాడు. ఆ తర్వాత ఏడాది ఆరు మ్యాచ్‌లు ఆడగలిగాడు. కానీ 2021లో అద్భుతంగా చెలరేగి ఆరెంజ్ క్యాప్ (635) గెలుచుకోగా.. 2022లోనూ జట్టు తరపున అతడివే అత్యధిక పరుగులు (368). అయితే విశేష అభిమానగణం ఉన్న సీఎస్కే నయా కెప్టెన్‌గా ఇప్పుడు ఏమేరకు రాణించగలడనేది వేచిచూడాల్సిందే..

ఐపీఎల్‌లో 2008 నుంచి సీఎస్కేను ఎంఎస్ అత్యద్భుత జట్టుగా మార్చాడు. అయితే జట్టు ఇప్పుడు సంధి దశలో ఉంది. బహుశా 42 ఏళ్ల ధోనీకిదే చివరి ఐపీఎల్. అందుకే జట్టులో తను కొనసాగినప్పుడే మరొకరికి పగ్గాలు అప్పజెప్పాలనుకున్నాడు. వాస్తవానికి 2022లోనే ధోనీకి ఈ ఆలోచన వచ్చి జడేజాను ముందుకు తెచ్చాడు. కానీ కేవలం 8 మ్యాచ్‌ల తర్వాత తిరిగి ధోనీయే నాయకుడయ్యాడు. అప్పుడు ఆ నిర్ణయం వర్కౌట్ కాలేదు కానీ ఈసారి అలా కాదని సీఈవో విశ్వనాథన్ చెబుతున్నాడు. అప్పట్లో తాము కూడా ఎంఎస్ నుంచి కెప్టెన్సీ మార్పునకు సిద్ధంగా లేమని, కానీ ఇప్పుడు ఆ పాత్రకు యువ ఆటగాళ్లను తయారుచేయాల్సిన అవసరం ఏర్పడిందని కోచ్ ఫ్లెమింగ్ చెప్పాడు. మరోవైపు ధోనీ బరిలోకి దిగుతాడా? లేదా? అని ఫ్యాన్స్ సందేహిస్తున్నారు. కొంతకాలం క్రితమే ధోనీ మోకాలికి సర్జరీ కూడా అయ్యింది. కానీ వీటన్నింటికి చెక్ పెడుతూ.. ఎంఎస్ సీజన్ మొత్తానికి అందుబాటులో ఉంటాడని ఫ్లెమింగ్ తేల్చాడు. గత సీజన్‌తో పోలిస్తే ఇప్పుడు తను మరింత ఫిట్‌గా ఉన్నాడని చెప్పాడు.

మహీయే వదిలేశాడు..

సీఎస్కే జట్టులో ధోనీ అంతర్భాగం. ఈ ఫ్రాంచైజీలో అతడేం చెబితే అదే జరుగుతుంది. ముంబై ఇండియన్స్ తరహాలో హార్దిక్‌ను కెప్టెన్‌గా చేసిన తీరును ఇక్కడ చూడలేం. అంతా ఎంఎస్ ఇష్టప్రకారమే జరిగిందని సాక్షాత్తూ సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథ్ తెలిపాడు. 'జట్టు ప్రయోజనాల కోసమే ధోనీ ఆలోచనలు ఉంటాయి. అతడి తాజా నిర్ణయం గురించి నాకు ఐపీఎల్ కెప్టెన్ల సమావేశానికి ముందు మాత్రమే తెలిసింది. కెప్టెన్‌గా వైదొలగడం కేవలం అతడి ఇష్టపూర్వకంగానే జరిగింది. మనం అతడి నిర్ణయాన్ని గౌరవించాల్సిందే' అని కాశీ తెలిపాడు.

గైక్వాడ్‌కు జై..

ముంబై కెప్టెన్‌గా హార్దిక్‌ను నియమించినప్పుడు సోషల్ మీడియాలో అభిమానుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. కానీ రుతురాజ్‌పై మాత్రం సీఎస్కే ఫ్యాన్స్ అభిమానం కురిపిస్తుండడం విశేషం. ఓ దేశవాళీ మ్యాచ్‌లో ఎంఎస్ నుంచి ఆటోగ్రాఫ్ తీసుకున్న రుతురాజ్.. నేడు అతడి నుంచే సారథ్యం అందుకోవడం భేష్ అంటూ కొనియాడుతున్నారు. అలాగే ఎంఎస్ 26 ఏళ్ల వయస్సులో దేశానికి టీ20 వరల్డ్‌కప్ అందించి.. 27 ఏళ్లకు సీఎస్కే కెప్టెన్ అయ్యాడని.. అలాగే 26 ఏళ్ల రుతురాజ్ భారత్‌కు ఆసియాకప్ స్వర్ణం అందించి.. 27 ఏళ్లప్పుడే సీఎస్కే సారథి అయ్యాడని ఫ్యాన్స్ గుర్తుచేసుకుంటున్నారు.

కెప్టెన్‌గా ఎంఎస్ కెరీర్

ఐపీఎల్ ఆరంభం నుంచి చెన్నై కెప్టెన్‌గా కొనసాగిన ధోనీ రికార్డు స్థాయిలో ఐదు టైటిళ్లు అందించాడు. 2010, 2011, 2018, 2021, 2023లో విజేతగా నిలిచిన జట్టు తాజాగా డిఫెండింగ్ చాంపియన్‌గానే బరిలోకి దిగుతోంది. అలాగే రెండుసార్లు చాంపియన్స్ లీగ్‌లోనూ విజేతగా నిలిపాడు. లీగ్‌లో అత్యధిక మ్యాచ్‌లకు కెప్టెన్సీ (226) వహించిన రికార్డు కూడా ధోనీదే. ఇందులో 133 విజయాలు, 91 ఓటములు, రెండు ఫలితం తేలనివి ఉన్నాయి. మొత్తంగా సీఎస్కే, రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ తరఫున 250 మ్యాచ్‌లను ఆడిన ఎంఎస్ 5082 పరుగులు సాధించాడు.

'తలా' దర్శనం లేకపాయె..

ఎంఎస్ ధోనీని విపరీతంగా ఆరాధించే అభిమానులు అతడిని నెట్స్‌లో చూసేందుకు కూడా ఎగబడుతుంటారు. ఈ క్రమంలో గతంలో చిదంబరం స్టేడియం ప్యాక్ అయిన వీడియోలు చక్కర్లు కొట్టేవి. కానీ ఈసారి ముందుగానే తమ ఆరాధ్య 'తలా' దర్శనం చేసుకునేందుకు ఫ్యాన్స్‌కు వీలు కాలేదు. ఎందుకంటే.. దేశంలో సాధారణ ఎన్నికల నేపథ్యంలో అభిమానుల కోసం స్టాండ్స్‌ను తెరిచేందుకు స్థానిక పోలీసులు అనుమతించలేదు. వేలాది ఫ్యాన్స్ తరలివస్తారు కాబట్టే భద్రత కోసం పోలీసుల అనుమతి తీసుకోవడం అవసరం. దీంతో ఏప్రిల్ 19 ఎన్నికల తర్వాత ఫ్యాన్స్‌ను నెట్స్‌లోకి అనుమతించాలని సీఎస్కే భావిస్తోంది.



మెగాలీగ్ కెప్టెన్లు

రాహుల్ (లఖ్‌నవూ)
కమిన్స్ (సన్‌రైజర్స్)
జితేశ్ (పంజాబ్ వైస్‌కెప్టెన్)
రుతురాజ్ (చెన్నై)
రిషభ్ పంత్ (ఢిల్లీ)
డుప్లెసి (బెంగళూరు)
గిల్ (గుజరాత్)
శాంసన్ (రాజస్థాన్)
హార్దిక్ (ముంబై)
శ్రేయాస్ (కోల్‌కతా)

చెన్నై: టీ20 ప్రపంచకప్‌నకు ముందే అభిమానులకు కావాల్సినంత వినోదం లభించనుంది. నేటి నుంచే ఐపీఎల్ 17వ సీజన్ ఆరంభం. అయితే ఈసారి లీగ్ సమయంలోనే దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగనుండడంతో ప్రస్తుతానికి 15 రోజుల షెడ్యూల్‌నే ప్రకటించారు. దీనిలో భాగంగా శుక్రవారం నుంచి ఏప్రిల్ 7 వరకు తొలి దశ మ్యాచ్‌లు జరగబోతున్నాయి. ఈమేరకు మొత్తంగా పది జట్లు, పది వేదికల్లో 21 మ్యాచ్‌ల్లో తలపడతాయి. మిగతా షెడ్యూల్ స్వదేశంలో ఉంటుందా? తటస్థ వేదికల్లో నిర్వహిస్తారా? అనేది తేలాల్సి ఉంది. మరోవైపు జాతీయ జట్టులో సహచరులుగా ఉన్న వారే ఇక మైదానంలో ప్రత్యర్థులుగా సవాల్ విసురనున్నారు. అటు ఫ్యాన్స్ కూడా తమ ఫ్రాంచైజీల వారీగా విడిపోయి విదేశీ ఆటగాళ్లకైనా జేజేలు పలికేందుకు సిద్ధమవుతున్నారు. దాదాపుగా అన్ని జట్లలో పలువురు కీలక ఆటగాళ్లు గాయాలతో దూరమైనా.. ఏ మాత్రం కళ తప్పని ఈ లీగ్‌లో స్టార్ ప్లేయర్లతో పాటు యువ ఆటగాళ్లు కూడా ఆకట్టుకోవాలనుకుంటున్నారు. అలాగే కారు ప్రమాదం నుంచి కోలుకుని తిరిగి బ్యాట్ పట్టనున్న ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ రిషభ్ పంత్ ఎలా రాణిస్తాడనేది ఫ్రాంచైజీతో పాటు భారత టీమ్ మేనేజ్‌మెంట్ కూడా ఆత్రుతగా ఎదురుచూస్తోంది..

విరాట్‌కు కీలకం



తాజా లీగ్‌లో అందరికళ్లూ విరాట్ కోహ్లీపైనే ఉండనున్నాయి. ధనాధన్ ఫార్మాట్‌లో యువ ఆటగాళ్లు దూసుకు వస్తుండడంతో టీ20 జట్టులో విరాట్ స్థానం సందేహంగా మారింది. ఈ లీగ్ ముగిశాక జూన్ 2 నుంచి టీ20 వరల్డ్‌కప్ ఉండడంతో ఆయా ఆటగాళ్ల ఫామ్‌ను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోనున్నారు. ఇప్పటికే విరాట్‌కు చోటు సందేహమనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. దీంతో ఈ ఐపీఎల్‌లో తనను తాను నిరూపించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. 2022 టీ20 వరల్డ్‌కప్ ముగిశాక విరాట్ ఆడింది కేవలం రెండు టీ20 మ్యాచ్‌లే కావడం గమనార్హం. వాస్తవానికి తన టీ20 ఫామ్ మరీ అంత పేలవంగా ఏమీ లేదు. 117 మ్యాచ్‌ల్లో 138.15 స్ట్రయిక్ రేట్‌తో ఈ ఫార్మాట్‌లో అత్యధికంగా 4,037 పరుగులు సాధించాడు.

ఆటలో 'విలువ' కనిపిస్తుందా?

డిసెంబరులో జరిగిన ఐపీఎల్ వేలంలో కనీవినీ ఎరుగని రీతిలో పలువురు ఆటగాళ్లను ఆయా ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్‌ను కోల్‌కతా జట్టు ఏకంగా రూ.24 కోట్ల 75 లక్షలకు తీసుకుంది. తమ పేస్ దళానికి ప్రధాన ఆయుధంగా పనికివస్తాడనే భావనలో కేకేఆర్ ఈ రికార్డు ధరకు మొగ్గు చూపింది. ఇక ప్యాట్ కమిన్స్ కోసం సన్‌రైజర్స్ రూ.20 కోట్ల 50 లక్షలను వెచ్చించింది. ఆసీస్‌కు టీ20 ప్రపంచకప్‌ను అందించినట్టే తమకు కూడా టైటిల్‌ను అందిస్తాడనే ఆశతో కెప్టెన్‌గానూ నియమించుకుంది. ఇక కామెరూన్ గ్రీన్‌ను ముంబై నుంచి బెంగళూరు రూ.17.50 కోట్లకు తీసుకుంది. వీరే కాకుండా కొందరు అనామక ఆటగాళ్లు కూడా కోట్లు పలికారు. ఈ విలువైన క్రికెటర్లు ఫ్రాంచైజీల ఆశలను తీరుస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది.

బోణీ కొట్టేదెవరో?

టోర్నీ ఆరంభానికి ఒక్క రోజు ముందు ఎంఎస్ ధోనీ నాయకత్వం నుంచి తప్పుకొన్నాడు. కొత్త కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్..డుప్లెసి నేతృత్వంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తాజా ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌ల్లో తలపడనున్నాయి. దీంతో తొలి మ్యాచ్‌లోనే భారత అభిమానులకు ధోనీ వర్సెస్ కోహ్లీ పోరు చూసే అవకాశం దక్కింది. సీఎస్కే టైటిల్ కాపాడుకునే ప్రయత్నంలో ఉండగా.. ఆర్‌సీబీ మాత్రం తీవ్ర ఒత్తిడిలోనే బరిలోకి దిగబోతోంది. డబ్ల్యూపీఎల్‌లో తమ ఫ్రాంచైజీ విజేతగా నిలవడంతో బెంగళూరు అభిమానుల ఫోకస్ పురుషుల జట్టుపైకి మారింది. పేరుతో పాటు జెర్సీలోనూ మార్పు చేసుకున్న ఈ జట్టు 16 ఏళ్లుగా ఊరిస్తున్న ఐపీఎల్ ట్రోఫీని ఎలాగైనా అందుకోవాలనే కసితో ఉంది. కొన్నేళ్లుగా ఇదే చివరి లీగ్‌గా అందరూ భావిస్తున్నా ధోనీ మాత్రం ప్రతీ సీజన్‌లో ఫ్యాన్స్‌ను మురిపిస్తూనే ఉన్నాడు. ఇప్పుడు కూడా 42 ఏళ్ల వయస్సులో అత్యంత ఫిట్‌గా కనిపిస్తూ సీఎస్కే ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తున్నాడు. ఇక ఓపెనర్ కాన్వే, పేసర్ పథిరన గాయాలతో ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానున్నారు. ధోనీతో పాటు రుతురాజ్, మిచెల్, జడేజా, రహానె, రచిన్, దీపక్, తుషార్ కీలక ఆటగాళ్లు. అటు ఆర్‌సీబీకి మాత్రం గాయాల బెడద లేకుండా ఆటగాళ్లంతా ఫిట్‌గా ఉన్నారు. కోహ్లీ కూడా సుదీర్ఘ విరామంతో తాజాగా కనిపిస్తున్నాడు. డుప్లెసి, మ్యాక్స్‌వెల్, దినేశ్ కార్తీక్, గ్రీన్, పటీదార్‌లతో ఆర్‌సీబీ బ్యాటింగ్ లైనప్ బలంగా కనిపిస్తోంది. పేసర్లు సిరాజ్, జోసెఫ్, ఫెర్గూసన్‌లపై జట్టు బౌలింగ్‌లో ఆధారపడి ఉంది.



రుతురాజ్

డుప్లెసి

క్వార్టర్స్‌లో గాయత్రి, రజావత్



బాసెల్ (స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో గాయత్రీ గోపీచంద్ జంట, ప్రియాన్షు రజావత్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరారు. గురువారం జరిగిన మహిళల డబుల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ 21-10, 21-12తో సహచర ద్వయం ప్రియ/శృతీ మిశ్రాపై సునాయాసంగా నెగ్గింది. పురుషుల సింగిల్స్ రౌండ్-16 పోరులో రజావత్ 21-14, 21-13తో లీ లాన్ జీ (చైనా)ను చిత్తు చేసి క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. ఇక మహిళల డబుల్స్ మరో రెండో రౌండ్‌లో అశ్వినీ పొన్నప్ప జంట పరాజయం పాలైంది. జపాన్‌కు చెందిన హిరోకామీ/కటోతో జరిగిన మ్యాచ్‌లో అశ్విని/తనీషా క్రాస్టో 17-21, 16-21తో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించారు.

'ద హండ్రెడ్'లో భారత్ నుంచి ఇద్దరే!



లండన్: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్ చాంపియన్ జట్టు ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధాన, కీపర్ రిచా ఘోష్‌కు మాత్రమే రాబోయే 'ద హండ్రెడ్' లీగ్‌లో చోటు దక్కింది. సదరన్ బ్రేవ్ జట్టు మంధానను తీసుకోగా, ఆమె ఆర్సీబీ సహచరి రిచా ఘోష్‌పట్ల బర్మింగ్‌హామ్ ఫీనిక్స్ జట్టు మొగ్గు చూపింది. ఎడమచేతి వాటం బ్యాటర్ స్మృతి తాజా డబ్ల్యూపీఎల్ 10 మ్యాచ్‌ల్లో 300 రన్స్‌తో సత్తా చాటింది. మరోవైపు ఫినిషర్‌గా అదరగొట్టిన ఘోష్ 10 మ్యాచ్‌ల్లో 142 స్ట్రయిక్ రేట్‌తో, రెండు అర్ధ శతకాలు సహా 257 పరుగులు సాధించింది. ఇన్నింగ్స్‌కు 100 బంతుల చొప్పున ఉండే ఈ లీగ్ లండన్‌లో జూలై 23 నుంచి జరగనుంది. మొత్తం ఎనిమిది జట్లు టోర్నమెంట్‌లో తలపడనున్నాయి. భారత్ నుంచి హర్మన్‌ప్రీత్, దీప్తిశర్మ, జెమీమా రోడ్రిగ్స్, శ్రేయాంక పాటిల్ సహా మొత్తం 17 మంది భారత క్రికెటర్లు హండ్రెడ్ లీగ్ డ్రాఫ్ట్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. కానీ జట్లేవీ వారిని తీసుకొనేందుకు ఆసక్తి చూపలేదు.

పారిస్ ఒలింపిక్స్

భారత పతాకధారి శరత్ కమల్

చెఫ్ డి మిషన్‌గా మేరీకోమ్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో భారత పతాకధారిగా వెటరన్ టీటీ ఆటగాడు శరత్ కమల్ వ్యవహరించనున్నాడు. ఈమేరకు కామన్వెల్త్ క్రీడల చాంపియన్ శరత్ పేరును భారత ఒలింపిక్ సంఘం గురువారం ప్రకటించింది. అలాగే దిగ్గజ బాక్సర్ మేరీకోమ్‌ను చెఫ్ డి మిషన్‌గా ఎంపిక చేసింది. కాగా..ర్యాంకింగ్స్ ఆధారంగా భారత పురుషులు, మహిళల టీటీ జట్లు పారిస్ ఒలింపిక్స్ టీమ్ విభాగాలకు అర్హత సాధించిన విషయం విదితమే. 'క్రీడల పట్ల అసమాన అంకితభావం, ఎందరికో స్ఫూర్తిగా నిలిచే మేరీకోమ్ చెఫ్ డి మిషన్‌గా భారత అథ్లెట్లకు మార్గదర్శనం చేయనుంది' అని ఐఓఏ తెలిపింది.

ఐపీఎల్‌కు జంపా దూరం

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఆరంభానికి ముందు రాజస్థాన్ రాయల్స్‌కు గట్టిదెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన స్పిన్నర్లలో ఒకడైన ఆస్ట్రేలియా ఆటగాడు ఆడమ్ జంపా మెగా లీగ్ నుంచి వైదొలిగాడు. జంపాను రాజస్థాన్ రూ. 1.5 కోట్లకు రిటైన్ చేసుకొంది. అయితే, గత కొంతకాలంగా తీరికలేని క్రికెట్ ఆడుతున్న జంపా విశ్రాంతి నిమిత్తం తప్పుకొన్నట్టు తెలుస్తోంది. జంపా తప్పుకోవడంతో స్పిన్ భారం అశ్విన్, యజ్వేంద్ర చాహల్‌పైనే పడనుంది. గత సీజన్‌లో రాయల్స్ తరఫున ఆరు మ్యాచ్‌లు ఆడిన జంపా 8 వికెట్లు పడగొట్టాడు.

కోడ్ ఉంది.. పోలీసుల తీరు మారాలి



● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మార్చి21: ముగ్గురు ఎస్పీలకు ఎన్నికల సంఘం ప్రశ్నలతోనైనా జగన్ భక్త పోలీసుల తీరు మార్చుకుంటే మేలని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. పట్టణంలోని తన నివాసగృహంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీలు స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ఈసీ ఆదేశించటం తీవ్రతను ఇకనైనా వారు అర్థం చేసుకోవాలన్నారు. ఈసీ శ్రీముఖాలతోనైనా ప్రకాశం, పల్నాడు, నంద్యాల జిల్లాల ఎస్పీలు పరమేశ్వరరెడ్డి, రవి శంకర్‌రెడ్డి, రఘు వీరారెడ్డిలు వైసీపీ భక్తి మత్తు నుంచి బయట పడి విధి నిర్వహణ పై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. కోడ్ వచ్చిన దగ్గర నుంచి జిల్లాలో ఎలాంటి అవాంఛ నీయ హింసాత్మక ఘటనలు జరిగినా ఎస్పీలనే బాధ్యులను చేస్తామని ఎన్నికల సంఘం ముందే ప్రకటించినా ఇప్పటికీ వైసీపీ అరాచకాలకు కొమ్ము కాస్తుండటమే దారుణమైన విషయం ఆయన అన్నారు. పల్నాడు వంటి అత్యంత సమస్యాత్మక ప్రాంతానికి ఎస్పీగా ఉన్న వ్యక్తి కూడా ఈ జాబితాలో ఉండటం మరింత ఆందోళన కలిగిస్తున్న విషయం అన్నారు. పోలీసులతో పాటు మిగిలిన అధికారులు కూడా కోడ్ అమల్లోకి వచ్చిన విషయాన్ని ఇక మీదటైనా గమనంలో పెట్టుకోకపోతే తరువాత వారంతా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రాజకీయాల కార్యకలాపాల్లో జోక్యం చేసుకుంటున్న వాలంటీర్ వ్యవస్థపైనా మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు.



గ్రామంలో పంచాయతీ సరఫరా చేసిన ఆకుపచ్చ రంగులో నీళ్ల బాటిల్, పోలీసులకు నీటి సమస్యను వివరిస్తున్న స్థానికులు

కోడ్ ఉందంటూ నీటి సరఫరా నిలిపివేత

కాకుమాను, మార్చి 21: గ్రామంలోని ప్రజల నీటి సమస్య పరిష్కారం కోసం దాతలు నీటి ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తుంటే... అనుమతి లేదని అధికారులు హెచ్చరించడంపై స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన మండల కేంద్రమైన కాకుమానులో గురువారం చోటు చేసుకుంది. గ్రామంలో వారం రోజుల నుంచి పంచాయతీ నీటి సరఫరా ఆపివేసింది. గ్రామంలోని ప్రజల తాగునీటి సమస్య తీవ్రత దృష్ట్యా దాతలు వాటర్ ట్యాంకర్‌ను ఏర్పాటు చేశారు. దీనిపై అధికారులకు సమాచారం ఇవ్వడంతో ట్యాంకర్‌ను నిలిపివేసి నీటి సరఫరా కోసం అనుమతి ఉందా.. లేకుంటే కేసులు పెడతామని, అరెస్టులు చేస్తామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు, ఎంపీడీవో రామకృష్ణ కూడా పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న స్థానికులపై దురుసుగా ప్రవర్తించారు. మహిళలు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉంటే గ్రామంలో తాగునీరు సరఫరా చేయకూడదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పెషల్ స్క్వాడ్ పోలీసులు పంచాయతీ కార్యాలయం నుంచి ప్రజలను బలవంతంగా పంపివేశారు.

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతిపాలు



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు

● టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నాలక్ష్మీనారాయణ
● పెదకూరపాడు నియోజకవర్గ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి 60 కుటుంబాలు..

అమరావతి, మార్చి 21: ఒక్క చాన్స్ ఇవ్వండంటూ కపట ప్రేమ ఒలకబోసి అధికారంలోకి వచ్చిన జగన్ మరోసారి అధికారం ఇస్తే మన ఆస్తులు కూడా దక్కవని మాజీమంత్రి సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం పెదకూరపాడు నియోజకవర్గం అమరావతి గ్రామంలో పల్నాడు జిల్లా కాపునాడు అధ్యక్షుడు పోలిశెట్టి వెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో 60 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారికి ఇరువురు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ వైసీపీ పాలనతో రాష్ట్రం అభివృద్ధిలో 20 సంవత్సరాల వెనక్కిపోయిందని అన్నారు. బటన్ నొక్కుడు పేరుతో ప్రజలకు పది రూపాయలు ఇచ్చి వెయ్యి లాక్కుంటూ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని అన్నారు. భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ జనసేన బీజేపీ కూటమి సంయుక్త కృషితో గెలుపు సాధ్యం అవుతుందన్నారు. వైసీపీ పాలనపై విసుగుచెంది అధికార పార్టీ నుంచి ప్రజలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని అన్నారు. కాపునాడు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న సత్యనారాయణను పార్టీలో సముచిత స్థానం కల్పించి గౌరవించడం జరుగుతుందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలు కన్నా లక్ష్మీనారాయణ, కొమ్మాలపాటి శ్రీధర్‌ను ఆదరించారని అదే విధంగా నాపైన మీ ఆశీస్సులు ఉండాలని మనసారా కోరుకుంటున్నానన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు ఏమయ్యాయి?

● టీడీపీ పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, మార్చి 21: మండలంలోని బొల్లాపల్లి మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు అధికార వైసీపీని వీడి టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు సమక్షంలో గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరాచక జగన్‌రెడ్డి పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలగాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలపరుస్తూ ప్రజలు టీడీపీలో చేరుతున్నారని అన్నారు. ఐదేళ్ళ జగన్‌రెడ్డి పాలనలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని, రాష్ట్ర రైతాంగానికి తీరని అన్యాయం చేశారన్నారు. ఎన్నికలకు ముందు ఏటా డీఎస్సీ ఇస్తానని జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రతి ఏడాది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్న జగన్మోహన్‌రెడ్డి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా నిరుద్యోగులను దగా చేశారని అన్నారు. నూతన ఇసుక పాలసీతో రాష్ట్రంలో ఇసుక కొరత సృష్టించి భవన నిర్మాణ కార్మిక రంగాన్ని నట్టేట ముంచి ఇసుక మాఫియాను ఏర్పాటు చేసుకొని జగన్‌రెడ్డి వందలకోట్లు దోచుకున్నారన్నారు. మద్యపాన నిషేదం చేస్తానని హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి నాశిరకం మద్యాన్ని సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని దుయ్యబట్టారు. సంక్షేమంటూ జగన్‌రెడ్డి ఒక చేత్తో వెయ్యి ఇస్తూ మరో చేత్తో పదివేలు వసూళ్ళు చేస్తున్నారని అన్నారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎన్నికలకు ముందు ప్రజలకు అనేక హామీలు గుప్పించి మోసం చేశారని, గుండ్లకమ్మ నదిపై తంగిరాల డ్యామ్ నిర్మిస్తానని, ఎత్తిపోతల పథకాలు తెస్తానని, వరికపూడిశల ప్రాజెక్టు నిర్మించకపోతే నేను మీ ముఖం చూడనని, ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి వేయిస్తానని వాగ్దానం చేసి ప్రజలను దగా చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారిలో శౌరిబాబు, ఉల్లిగడ్డల బాజి, బాబు, ఆకాష్, మరియబాబు, జక్క నాగరాజు, చేవూరి నాగరాజు, పెద్ద మరియన్న ఉన్నారు. జరపాల గోవిందు, పెమ్మసాని నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



రెడ్డిపాలెం గ్రామస్థులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న జీవీ

అశ్రునయనాలతో గుంటుపల్లి అంతిమయాత్ర



నివాళులర్పిస్తున్న నక్కా ఆనందబాబు, కొల్లు రవీంద్ర, యరపతినేని

● పాల్గొన్న టీడీపీ ఉమ్మడి జిల్లా నేతలు
● పాడె మోసిన యరపతినేని, కొల్లు రవీంద్ర, చదలవాడ

దాచేపల్లి,మార్చి 21: టీడీపీ జాతీయ క్రమశిక్షణా కమిటీ సభ్యులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు, నవ్యాంధ్రప్రదేశ్‌లో ఒకసారి రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మన్‌గా పనిచేసి అనారోగ్యంతో మృతి చెందిన గుంటుపల్లి నాగేశ్వరరావు అంతిమ యాత్రలో టీడీపీకి చెందిన మాజీమంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీలో రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు పాల్గొన్నారు. గురువారం దాచేపల్లిలోని బీసీ కాలనీలో గుంటుపల్లి నివాసం నుంచి శ్మశాన వాటిక వరకు భారీ అంతిమయాత్ర నిర్వహించారు. గుంటుపల్లికి అంతిమసంస్కారం జరుగుతుండగా బీసీలకుచెందిన మంచి నాయకుడిని పార్టీ కోల్పోయిందని, తనకు చేదోడువాదోడుగా వుంటూ పార్టీ కార్యక్రమాలలో చురుగ్గాపాల్గొన్న గుంటుపల్లి ఆకస్మిక మరణం తననెంతగానో బాధించిందని యరపతినేని కన్నీటిపర్యంతమ య్యారు. గుంటుపల్లి పాడెను మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లు రవీంద్ర, మాజీమంత్రి నక్కా ఆనంద బాబు, పల్నాడుజిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా, నరస రావుపేట ఇన్‌చార్జి చదలవాడ అరవిందబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతుల మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పెదకూరపాడు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్, కోడెలశివరాం తదితరులు పాల్గొని మోశారు. దాచేపల్లిలోని పురవీధులలో గుంటుపల్లి అంతిమయాత్రసాగగా, పార్టీలతో సంబంధం లేకుండా అన్నివర్గాల నేతలు గుంటుపల్లి నాగేశ్వరరావు భౌతిక దేహానికి నివాళులర్పించారు.



గుంటుపల్లి పాడె మోస్తున్న యరపతినేని, అరవిందబాబు



నిధులు మంజూరు కాకపోయినా సీసీ రోడ్డుకు కీవాల్స్ వేసిన వైసీపీ నేతలు

ఓట్లేయండి.. రోడ్డేస్తాం..

● ఓటర్లను ప్రభావితం చేసేందుకే వైసీపీ నేతల యత్నం

రేపల్లె, మార్చి 21: నిజాంపట్నం మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో అధికార పార్టీ నాయకులు ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయినా సీసీ రోడ్ల నిర్మాణం కోసం గుట్టుచప్పుడు లేకుండా తెల్లారేసరికి కీవాల్స్ వేశారు. వైసీపీకి చెందిన కీలక నేత మీ ఊరికి రహదారి వేస్తాం మీ ఓట్లన్ని మాకు వెయ్యాలంటూ గత రెండు రోజుల క్రిందట ఆ గ్రామ ప్రజలకు హామీనిచ్చారు. అయితే కొంతమంది గ్రామస్తులు.. పంచాయతీ రాజ్ అధికారుల అనుమతి లేకుండా సీసీ రోడ్లు ఎలా వేస్తారంటూ నిలదీశారు. దీనిపై పంచాయతీ రాజ్ అధికారుల వివరణ కోరగా తమకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

పోలింగ్ బూతలలో మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు..

● ఎన్నికల కమిషన్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజ్ఞప్తి

గుంటూరు సిటీ, మార్చి 21: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాష్ట్రంలో ఉన్న మహిళలు (గర్భిణులు, బాలింతలు) కోసం పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఎన్నికల కమిషనర్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకట లక్ష్మీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె గురువారం ఆంధ్రప్రదేశ్ ఎలక్షన్ కమిషన్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద మహిళలకు వేరుగా క్యూలైన్ లు ఏర్పాటు చేయాలని లేఖలో పేర్కొన్నారు. కొన్ని అత్యవసర సందర్భాల్లో మహిళలపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు, తదితర విషయాల్లో వారికి తగు న్యాయం చేయడం కోసం బాధితులను పరామర్శించడానికి మహిళా కమిషన్ చైర్‌పర్సన్, మెంబర్లకు ఎన్నికల నిబంధనలలో సడలింపు ఇవ్వవలసినదిగా గజ్జల వెంకట లక్ష్మీ కోరారు.

విద్యుత్ బకాయి వసూళ్లపై దృష్టిసారిచండి

● అధికారులకు సీపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఆదేశం

గుంటూరు, మార్చి 21: గుంటూరు, సీఆర్‌డీఏ సర్కిల్స్‌లో విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయని, వసూళ్ళపై సీరియస్‌గా దృష్టి సారించాలి అని ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ కే.సంతోషరావు అధికారులకు సూచించారు. గుంటూరు విద్యుత్‌భవన్‌లోని సమావేశ హాల్లో గురువారం గుంటూరు, సీఆర్‌డీఏ సర్కిల్స్ డివిజన్, సబ్ డివిజనల్ అధికారులతో సీఎండీ సమీక్షా నిర్వహించారు. వినియోగదారులకు విద్యుత్ సేవలు నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, లేని పక్షంలో సంబంధిత అధికారులు తిరిగి వినియోగదారులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కొత్త సర్వీసుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, పీక్ అవర్స్‌లో లోడ్ బ్యాలెన్స్ చేసుకోవాలని, అంతరాయాలు లేకుండా చూడాలని ఆదేశించారు. వేసవిలో లోడ్‌ను దృష్టిలో పెట్టుకొని ట్రాన్స్‌ఫార్మర్స్‌ను అవసరానికి అనుగుణంగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా విద్యుత్ వ్యవస్థ ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డివిజన్ వారీగా పవర్‌పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా రెవెన్యూ వివరాలను సీఎండీ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సీపీడీసీఎల్ డైరక్టర్స్ బీ.జయ భారతరావు(టెక్నికల్), టీ.వనజా(ప్రాజక్ట్స్), సీజీఎంలు ఏ.రామ్‌దాస్, కేఎస్.పరబ్రహ్మం, ఆపరేషన్ సర్కిల్స్ ఎస్ఈలు ఆవుల మురళీకృష్ణ యాదవ్(గుంటూరు), ప్రత్తిపాటి విజయ్‌కుమార్(సీఆర్‌డీఏ), ఎనర్జీ ఆడిట్ విజయకృష్ణ, డివిజనల్ అధికారులు, ఏడీఈలు పాల్గొన్నారు.

అరుణాచలంనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

గుంటూరు, మార్చి 21: ఈనెల 25న పౌర్ణమికి అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తులకోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 23న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 24వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదేరోజు రాత్రి అక్కడే బసచేసి 25న పౌర్ణమిన అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదేరోజుసాయంత్రం బయల్దేరి 26న ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 బస్సు సర్వీస్ నెంబర్‌కు ఆన్‌లైన్ రిజర్వేషన్ అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోఛార్జీ రూ. 2420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459 సంప్రదించాలని కోరారు.



స్థానిక నేతలు, గ్రామస్థులతో మాట్లాడుతున్న శ్రీకృష్ణదేవరాయలు

నదుల అనుసంధానంతో పల్నాడు సుభిక్షం

● టీడీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు

కారంపూడి, మార్చి 21: కృష్ణ, గోదావరి, పెన్నా నదుల అనుసంధానమే తన లక్ష్యమని, నదుల అనుసంధానం జరిగితేనే తాగునీటి ఇబ్బందులు లేకుండా పల్నాడు ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని టీడీపీ, జనసేన, బీజేపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. గురువారం కారంపూడిలో ఆయన పర్యటించి నేతలు, కార్యకర్తలు, ప్రజలతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2022లోనే పార్లమెంట్ సమావేశంలో దీనిపై బడ్జెట్ కేటాయించిందని, పనులు మాత్రం ప్రారంభం కాలేదని చెప్పారు. రానున్న ఐదేళ్లలో నదుల అనుసంధానంకు ప్రాధాన్యతను ఇస్తామన్నారు. ఇందుకోసం నిధులు మంజూరు చేయించామని, ప్రాజెక్ట్ ప్రారంభానికి నోచుకోలేదని చెప్పారు. ఇది పూర్తయితే మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల్లో తాగు, సాగునీటి సమస్య ఉండదన్నారు. పల్నాడు ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో చర్చించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆర్యవైశ్య సంఘ నేతలతో సమావేశమయ్యారు. ఎస్సీ కాలనీలో పర్యటించి కాలనీ అభివృద్ధికి కృషిచేస్తానని చెప్పారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఆయన వెంట తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు పంగులూరి అంజయ్య, మాజీ అధ్యక్షుడు చప్పిడి రాము, బొల్నేడి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ జాస్తి గంగారావు, కొంగర లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ ఉన్నం శ్రీను, ఉప ఎంపీపీలు పంగులూరి పుల్లయ్య, చావా వీరాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్‌జాని, తెలుగు యువత మండల అధ్యక్షుడు చిన రత్తయ్య, బీసీ సెల్ కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్, దోర్నాల బ్రహ్మారెడ్డి, నాగిరెడ్డి, నాగవరపు రాముడు, జనసేన మండల అధ్యక్షుడు కేసనపల్లి కృష్ణబాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి హనుమంతురావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పువ్వాడ శ్రీనివాస్, కర్ల అమరసైదయ్య తదితరులు ఉన్నారు.



సమావేశానికి హాజరైన సమన్వయ కమిటీ సభ్యులతో డాక్టర్ బీ.లక్ష్మి

పరిశోధనలతో రైతులకు మేలు

● వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ బీ.లక్ష్మి

బాపట్ల, మార్చి21: ఏరువాక కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు సమన్వయ కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగకరమని లాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహాయ సంచాలకులు డాక్టర్ బీ.లక్ష్మి తెలిపారు. బాపట్ల ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. బాపట్ల ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ బాలమురళీధర్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ శ్రీలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పరిశోధన అనేది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. అందువలనే కొత్తరకాలు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నాయని రైతులు ముందస్తు ప్రణాళికతో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. అనంతరం రైతులు, శాస్త్రవేత్తల చర్చా కార్యక్రమానికి వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణా విభాగాధిపతి, ప్రొఫెసర్ డాక్టర్ ఎంసీ ఓబయ్య, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.వి.రమణ, డీఆర్‌సీ డీటీసీ డాక్టర్ ఎం.విజయనిర్మల, బాపట్ల పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.హనుమంతరావు, మత్స్యశాఖ జేడీ డాక్టర్ పి.సురేష్, జిల్లా వ్యవసాయశాఖ ఏడీఏ టి.రత్నకుమారి, బాపట్లలోని వ్యవసాయ కేంద్రాల వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరై అపరాల సేద్యం, సేంద్రియ వ్యవసాయం, కలుపునివారణ మందుల వాడకం, వివిధ ఆధునిక వ్యవసాయ పనిముట్ల వాడకం వంటి విషయాలపై సూచనలు, సలహాలిచ్చారు.

వైసీపీకి మదమంచి రాజీనామా

సత్తెనపల్లి, మార్చి 21: పార్టీ కోసం మూడున్నర ఎకరాలు పొలం అమ్ముకున్నా వైసీపీలో సరైన ప్రాధాన్యం లేక పోవటంతో ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వైసీపీ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల పార్టీ మాజీ కన్వీనర్ మందమంచి రాంబాబు తెలిపారు. గురువారం సత్తెనపల్లిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఏర్పాటు చేసినప్పటి నుంచి పార్టీ కోసం ఎంతో త్యాగం చేసినట్లు ఆయన తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ స్థానిక నాయకత్వం సరైన ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. అయినప్పటికీ ఇప్పటి వరకు పార్టీలో కొనసాగానన్నారు. పదవిప్పన్నప్పటికీ సామాన్య కార్యకర్తగానే కొనసాగానన్నారు. గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ పదవులను వైసీపీ తరపున ఏకగ్రీవంగా గెలిపించుకున్నప్పటికీ స్థానిక నాయకత్వం గ్రామాభివృద్ధికి ఎటువంటి సహకారం అందించ లేదన్నారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన తాను కట్టావారిపాలెం సర్పంచ్ అయిన మదమంచి పార్వతి కుమారి, గ్రామ ఎంపీటీసీ, తన సోదరి దేవినేని అనురాధలు కూడా పార్టీకి రాజీనామా చేసినట్టు మందమంచి రాంబాబు తెలిపారు.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

మా ఊపిరి అమరావతి

● 1556వ రోజుకు రైతుల ఆందోళన

తుళ్ళూరు, మార్చి 21: అమరావతిని కాదని రాష్ట్రాభివృద్ధిని సీఎం జగన్‌రెడ్డి అడ్డుకున్నాడని 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1556వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ ప్రజా రాజధాని అమరావతి తమ ఊపిరి అని పేర్కొన్నారు. మూడు రాజధానులని అమరావతి నిర్వీర్యం చేసి, అభివృద్ధి లేకుండా వినాశనం చేశారన్నారు. ప్రాంతాల మధ్య తారతమ్యం తీసుకొచ్చి మూడు ముక్కల ఆటతో రాష్ట్రాభివృద్ధి లేకుండా చేశారన్నారు. పరిశ్రమలు పారిపోయేటట్టు చేసి ఉద్యోగావకాశాలు లేకుండా నిరుద్యోగం పెంచాడన్నారన్నారు. ఎడారి శ్మశానం, అడవి అంటూ అమరావతిపై అభాండాలు వేయటం దుర్మార్గమన్నారు. సీఎం జగన్‌రెడ్డి పదవి నుంచి దిగిపోయే ముందు అమరావతిని రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించి అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. అమరావతివెలుగు కార్యక్రమం కొనసాగింది, రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

అట్రాసిటీ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి



పెమ్మసానికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ ధర్మారావు

తెనాలి రూరల్, మార్చి 21: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును వైసీపీ ప్రభుత్వం నీరుగారుస్తుందని, అట్రాసిటీ కేసు నమోదుచేసిన వెంటనే స్టేషన్ బెయిల్‌పై నిందితులను విడుదలచేస్తూ తమకు రాజ్యాంగం కల్పించిన హక్కును కాలరాస్తుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఉన్నం ధర్మారావు మాదిగ అన్నారు. గురువారం మండలంలోని హాఫ్‌పేటలో ఎన్నికలప్రచారంలో భాగంగా పర్యటిస్తున్న గుంటూరు పార్లమెంటరీ నాయకులు పెమ్మసాని చంద్రశేఖర్‌ను, తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌ను, తెనాలి టీడీపీ ఇన్‌చార్జి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిసిన ధర్మారావు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్‌ను అమలు చేయాలని, ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించేలా కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకునేందుకు తమవంతు కృషి చేస్తామని ధర్మారావు మాదిగ వారికి తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

1,04,332 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,06,381 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,04,332 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 81,360 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	9000	15000
273	12000	19000
341	9000	18500
4884	11500	13500
సూపర్ 10	11500	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	22000
బ్యాడిగి	9500	19500
దేవనూరు డీలక్స్	9000	20000
తెల్లకాయలు	5000	12500

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



సమావేశంలో మాట్లాడుతున్న యరపతినేని

సూపర్ 6 పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి యరపతినేని

గురజాలటౌన్, మార్చి 21 : సూపర్ 6 పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి గురజాల నియోజకవర్గ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నేతలు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని, వైసీపీ ప్రభుత్వంలోని అరాచకాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. రానున్న రోజుల్లో సైకో ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ప్రజలకు సంసిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ అభివృద్ధి పేపరు ప్రకటనలకే పరిమితమైందన్నారు. పట్టణంలోని సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతానికి సూచనలు చేశారు. సమావేశంలో యరపతినేని నిఖిల్, టీడీపీ మండల, పట్టణ అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, అడపా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు వరలక్ష్మి బొల్లయ్య, చాగంటి శ్రీను, కొట్టే శ్రీను పాల్గొన్నారు.

సమన్వయంతో ముందడుగు

● యరపతినేనితో కలిసినడిచేందుకు పలు వర్గాలు సమాయత్తం



డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాసరావును కలిసిన యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి 21: గురజాల నియోజకవర్గంలో పలు కారణాలతో పార్టీకి దూరంగా ఉన్న నేతలను స్వయంగా కలిసి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సమన్వయం చేసుకుంటున్నారు. గురజాలకు చెందిన వైద్యులు చల్లగుండ్ల శ్రీని వాసరావు గురజాలలో యరపతినేని స్వయంగా కలిశారు. అధినేత చంద్రబాబు నిర్ణయానికి కట్టుబడి పార్టీ గెలుపునకు కృషి చేస్తానని డాక్టర్ చల్లగుండ్ల యరపతినేనికి హామీ ఇచ్చారు. దూరంగా ఉన్న ఇద్దరు నేతలు దగ్గర కావడంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. దాచేపల్లిలో కాపు సామాజికవర్గ నేతలు త్వరలో టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. పిడుగురాళ్లకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు కూడా యరపతినేనితో కలిసి అడుగులు వేస్తామని తెలిపారు. పిడుగురాళ్ల, గురజాలకు చెందిన పలువురు న్యాయవాదులు రెండు రోజుల క్రితమే పిడుగురాళ్లలో యరపతినేని సమక్షంలో టీడీపీలో చేరారు.

మర్కస్ మసీదులో నిఖిల్ ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న యరపతినేని నిఖిల్

గురజాల టౌన్, మార్చి 21 : గురజాల అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ గురువారం పట్టణంలోని జామి యా మర్కస్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇఫ్తారులో పాల్గొని ఉపవాసం చేస్తున్న ముస్లింలకు స్వీట్లు అందించారు. అనంతరం దువాలో పాల్గొన్నారు.

తురకపాలెంలో యరపతినేని రమేష్ ఎన్నికల ప్రచారం

మాచవరం, మార్చి 21 : మండలంలోని తురకపాలెం గ్రామంలో గురువారం యరపతినేని రమేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయడం జరుగుతుందని, అన్నిరంగాల వారికి సంక్షేమ పథకాలు అం దించడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాబువలి, తెలుగు యువత మండల అధ్యక్షుడు మస్తాన్‌వలి, అల్లావుద్దీన్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుమ్మలచెరువులో పోలీసు కవాతు

పిడుగురాళ్ల, మార్చి 21 : రానున్న సాధారణ ఎన్నికలలో తుమ్మలచెరువు గ్రామంలో ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు గ్రామస్తులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని పట్టణ సీఐ పి.వీరాంజనేయులు తెలిపారు. తుమ్మలచెరువు గ్రామంలో పోలీసు, సాయుధ బలగాలతో గురువారం కవాతు నిర్వహించారు. ప్రజలందరూ ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని, ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చూడాలన్నారు.

ఓటర్లకు తాయిలాలు పంపిణీపై సమాచారం ఇవ్వండి : సీటీవో

పిడుగురాళ్ల, మార్చి 21 : ఓటర్లను ప్రలోభపె ట్టి ఓట్లు వేయించు కునేందుకు కొన్ని వస్తువులు దిగుమతి చేయడం, పంపి ణీ చేయడం వంటి సమాచారాన్ని తెలియజేయాలని పిడుగురాళ్ల వాణిజ్య పన్నుల శాఖ అసి స్టెంట్ కమిషనర్ పీవీ రంగయ్య తెలిపారు. పార్శిల్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఎక్కడైనా ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా వస్తువులను దాచినా 9154970445 నెంబరుకు సమాచారం ఇవ్వాలని రంగయ్య తెలిపారు.

ఒక్క ఛాన్స్ పేరుతో ప్రజలను మోసం చేసిన జగన్

● ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ



ఎస్టీ సెల్ నేతలతో కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి మార్చి 21 : తల్లికి చెల్లికి న్యాయం చేయలేని వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజలకేమి న్యాయం చేస్తాడని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని ప్రజావేదికలో గురువారం టీడీపీ ఎస్టీ సెల్ కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జగన్ జైల్లో ఉంటే పార్టీ కోసం కష్టపడ్డ తల్లీ, చెల్లిని రోడ్డుకెక్కించాడని అన్నారు. సొంత బాబాయిని చంపించాడని కన్నా అన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో రాష్ట్ర ప్రజలను జగన్ మోసం చేశాడని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా మొగిలి వీర్ల అంకయ్య, ఉపాధ్యక్షుడిగా కుంభా వెంకటేశ్వర్లు, మేడా వెంకటేశ్వర్లు, కొజ్జా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా మేగవత్ శ్రీనునాయక్, అధికార ప్రతినిధులుగా మేడా యలమంద, నాగమణి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కుంభా కోటేశ్వరి, మేడా సాంబ్రాజ్యం, మేడా నాగరాజు, దేవరకొండ నాగరాజు, చల్లంచర్ల శ్రీను, కార్యదర్శులుగా రామావత్ వెంకట్రావు నాయక్, మేడా నాగరాజు, పి.రాంబాబు, శ్రీకాంత్, ప్రసాద్, గోవింద్‌నాయక్, తుపాకుల శ్రీను, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా అద్దూరి వెంకటేశ్ బాధ్యతలు చేపట్టారు.

గుంటుపల్లి మృతి బీసీలకు తీరనిలోటు

● సంతాపం తెలిపిన టీడీపీ మండల నాయకులు

దాచేపల్లి, మార్చి 21 : టీడీపీ సీనియర్ నేత, రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ చైర్మన్‌గా పని చేసి అనారోగ్యంతో మృతి చెందిన గుంటుపల్లి నాగేశ్వరరావు మృతికి తీవ్ర దిగ్భ్రాంతిని, విచారం వ్యక్తం చేస్తున్నట్లు దాచేపల్లి మండల టీడీపీ నాయకులు తెలిపారు. గుంటుపల్లి అంతిమయాత్రలో గురువారం దాచేపల్లి, గురజాల, మాచవరం, పిడుగురాళ్ల పట్టణ, రూరల్ అధ్యక్షులు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేశ్, యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి ప్రజల సమస్యలపై, ప్రధానంగా బడుగు, బలహీన వర్గాల సమస్యలపై గుంటుపల్లి రాజీలేని పోరాటం చేశారన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయా కార్యక్రమాలలో బెల్లంకొండ బద్రి, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పాండురంగ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, బడిగుంచల వెంకటేశ్వర్లు, తంగె ళ్ల శ్రీనివాసరావు, అక్కినపల్లి బాలయ్య, నర్రా పుల్లయ్య, చింతపల్లి హసన్ అహ్మద్, పగడాల భాస్కరరావు, అచ్చారావు, నెల్లూరి రామకోటయ్య, మామిడి చంద్రశేఖరరావు, వేముల వినోద్‌రెడ్డి, గుడె సైదయ్య, వేముల తిరుమలకుమార్, బుర్రి కొండలు, తవ్వా శ్రీనివాసరావు, చికెన్ జానీబాషా, నాయబ్ అబ్దుల్లా, షేక్ అహ్మద్ షరీఫ్, షేక్ పెదలాల, బొమ్మిరెడ్డి సత్యం, నారాయణ, బుర్రి సురేష్, రామాంజనేయులు, ఎలిశెట్టి అప్పారావు ఉన్నారు.

వార్డులను తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు

మాచర్ల రూరల్, మార్చి 21 : పట్టణంలోని పలు వార్డులను గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు వార్డుల్లో పర్యటించి వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్లు తదితర వసతులపై కమిషనర్ తనిఖీ జరిపారు.

దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం : కృష్ణారెడ్డి

రెంటచింతల, మార్చి 21 : మండు వేసవిలో పాదచారులు, పొలం వెళ్లి వచ్చే కూలీల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని జీడీసీఎంఎస్ మాజీ డైరక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి అన్నారు. రెంటచింతలలో ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరుసగా ఆరవసారి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. 90 రోజుల పాటు కూలింగ్ తాగునీటిని అందించే దాతలు ఎస్.భాస్కరరెడ్డి, చెన్నారెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నవులూరి భాస్కరరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ గొట్టం బ్రహ్మారెడ్డి, ఫౌండేషన్ చైర్మన్, విద్యావేత్త పేరం చెన్నారెడ్డి, పమ్మి సీతయ్య, పిచ్చిరెడ్డి,సీపీఐ మండల అధ్యక్షుడు రంగనాయకులు, సైదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి నుంచే జనన ధ్రువీకరణ పత్రాలు

రెంటచింతల, మార్చి 21 : గతేడాది అక్టోబరు 1 తరువాత పుట్టిన పిల్లల జనన ధ్రువపత్రాలు ఆసుపత్రి నుంచే పొందాలని పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.కృష్ణారెడ్డి చెప్పారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి నుంచి ఆదేశాలు అందాయన్నారు.

సీ విజిల్ యాప్‌ను ఉపయోగించుకోవాలి

రెంటచింతల, మార్చి 21 : రానున్న ఎన్నికల్లో తమ కళ్లెదుట జరుగుతున్న అక్రమాలను ప్రభుత్వ దృష్టికి తెచ్చేందుకు సీ విజిల్ యాప్ ఎంతగానో దోహదపడుతుందని ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు అధికారి పెదప్రోలు శంకరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం, మత్తు పదార్థాలు, డబ్బు, ఇతర వస్తు సామగ్రి పంపిణీ, ఓటర్ల తరలింపు, అనుమతి లేకుండా వాహనాల వినియోగం, గడువు ముగిసిన తర్వాత ప్రచారం, ఓటర్లను భౌతికంగా, మానసికంగా భయపెట్టడం తదితరాలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మాచర్ల రూరల్, మార్చి 21 : మండలంలోని రాయవరంనకు చెందిన అందుగుల ఆరోగ్యరాజు ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మదర్‌థెరిస్సా సేవా సమితి సభ్యులు గురువారం పట్టణంలోని తమ కార్యాలయంలో ఆరోగ్యరాజు కుమారుడు రాజ్‌కమల్, కుమార్తె లూర్ధుమేరిలకు రూ.20 వేల ఆర్థికసాయం అందించారు. సేవా సమితి మాజీ అధ్యక్షుడు, న్యాయవాది చిలమకూరి నాగిరెడ్డి, శివపార్వతి దంపతులు ఈ సేవా కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో శ్రావ్య, రాహుల్‌రెడ్డి, గాదె కిరీటిరెడ్డి, జక్కిరెడ్డి మర్రెడ్డి, ఎ.చంద్రయ్య, జక్కిరెడ్డి చిన్నపురెడ్డి, కసిరెడ్డి శాంతిరెడ్డి, తుమ్మా మర్రెడ్డి, నాగభూషణాచారి, ఈశ్వర్‌రెడ్డి, గట్ల సత్యనారాయణరెడ్డి, మహేష్, శ్రీనివాసరావు, అందుగుల జోజి పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం

మాచర్ల టౌన్, మార్చి 21 : అటవీ శాఖ ఆధ్వర్యాన గురువారం పట్టణంలోని చెంచుకాలనీలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజర్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థికి ఆర్థిక సహాయం

అచ్చంపేట, మార్చి 21 : మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన గనుపల్లి రాసి అనే 10వ తరగతి విద్యార్థికి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం గురువారం రూ.4 వేల ఆర్థిక సహాయాన్ని భాష్యం ప్రవీణ్ నాయకుల ద్వారా అందించారు. ఈ విద్యార్థిని అమరావతిలోని రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతూ అనారోగ్యానికి గురి కాగా ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం వీటిని అందించారు.

అక్రమంగా వంతెన నిర్మిస్తున్నారని ఫిర్యాదు

సత్తెనపల్లి, మార్చి 21 : పట్టణ పరిధిలోని పిడుగురాళ్ళ రోడ్డులో ఉన్న వాగుపై కొంత మంది వ్యక్తులు అక్రమంగా వంతెన నిర్మాణం చేస్తున్నారని, దీని వల్ల భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తుతాయని, విచారించి చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్రాంత ఎస్ఐ భాస్కరరావు గురువారం మునిసిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఇబ్బందులు ఏర్పడతాయని ఆయన అన్నారు. పట్టణ ప్రజల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని అక్రమంగా బ్రిడ్జి నిర్మిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్నికల అధికారులు దృష్టి సారించాలి : నరిచేటి

సత్తెనపల్లి, మార్చి 21 : పట్టణంలోని వలంటీర్లు నిర్వహిస్తున్న వాట్సాప్ గ్రూపుల్లో ప్రొఫైల్ ఫొటోగా సీఎం జగన్ ఫొటో పెట్టడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నరిచేటి వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వలంటీర్లు నిర్వహిస్తున్న వాట్సాప్ గ్రూపులను వెంటనే నిలుపుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.

తెలుగు యువత నాయకుడు గోపి మృతికి సంతాపం

క్రోసూరు, మార్చి 21 : మండలంలోని ఊటుకూరు ఎస్సీ కాలనీకి చెందిన తెలుగు యువత నాయకుడు బంకా గోపి(32) గుండెపోటుతో గురువారం ఉదయం మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గోపీ మృతికి రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి వేగుంట రాణి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ కూడా ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రవీణ్ అనుచరుడు హరిబాబు ద్వారా మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. టీడీపీ నాయకులు వాసిరెడ్డి మల్లేశ్వరరావు, రూబెన్, రవి, ఖాజా తదితరులు ఉన్నారు.

సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు : కమిషనర్

సత్తెనపల్లి, మార్చి 21 : సీ విజిల్ ద్వారా ఎన్నికల అధికారులకు ప్రజలు తాము గుర్తించిన సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిసిపల్ కమిషనర్ షమ్మి గురువారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై సీ విజిల్ యాప్ ద్వారా స్వీకరిస్తున్నామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో నిఘా బృందాలు, వీడియో వీక్షణ బృందాలు పని చేస్తున్నాయన్నారు. ఎన్నికల విధులకు వలంటీర్లు సహకరిస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తే చర్యలు : సీఐ

సత్తెనపల్లి, మార్చి 21 : సోషల్ మీడియాలో ట్రోలింగ్‌లు, తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సామాన్యులను లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియాలో వేధింపులు, ట్రోలింగ్‌లను పోలీసు శాఖ తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. అసభ్యకర, రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్న వారి ఐపీ అడ్రెస్ గుర్తించి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

రామాంజనేయులుపై దాడికి ఖండన

సత్తెనపల్లి, మార్చి 21 : ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి రామాంజనేయులుపై వైసీపీ రౌడీలు దాడి చేయడం దారుణం అని టీడీపీ ఎస్సీ సెల్ నేతలు అన్నారు. టీడీపీ ప్రజా వేదికలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రామాంజనేయులుపై దాడి చేసి కారు అద్దాలు పగులగొట్టిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బండారు నాగరాజు, పల్లె మార్కు రాజు, బి.సురేష్‌కుమార్, కొదముల కోటేశ్వరరావు, బొలమాల ప్రభుదాస్, చిలకా చంటి, బండారు ఏలియా ఉన్నారు.

బీసీల ద్రోహి వైఎస్ జగన్ : డీవీ నారాయణ

ముప్పాళ్ళ, మార్చి 21 : టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన బీసీ సంక్షేమ పథకాలను రద్దు చేసి 76 వేల కోట్ల బీసీ నిధులు దారి మళ్లించిన జగన్ బీసీల ద్రోహి అని మాజీ ఎంపీటీసీ, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు డబ్బుకొట్టు వెంకట నారాయణ గురువారం విలేఖరుల సమావేశంలో అన్నారు. అన్ని వర్గాలకు కేటాయించిన పథకాలనే బీసీలకు ఇస్తూ వాటినే ప్రత్యేకంగా ఇస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 10 శాతం రిజర్వేషన్ కోత కోసి 16,800 రాజ్యాంగ బద్ధ పదవులను బీసీలకు దూరం చేశాడన్నారు. బీసీలకు 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి అలంకారంగా పదవులను కట్టబెట్టి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా బీసీలను జగన్ ప్రభుత్వం అవమానించిందన్నారు.

టీడీపీలో చేరిన 60 కుటుంబాల వైసీపీ నాయకులు

అమరావతి, మార్చి 21 : అమరావతి గ్రామంలో జిల్లా కాపునాడు అధ్యక్షుడు పోలిశెట్టి వెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో 60 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్, సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. వైసీపీ నుండి టీడీపీ చేరిన వారిలో మానూరు వెంకట రమేష్, అమ్మిశెట్టి వెంకటనారాయణ, తోట ఆనంద్, మల్లెల శంకర్, ఆకుల నాగేశ్వరరావు, ఆకుల కోటయ్య, వైకుంఠపురం చిన్న, లక్కింశెట్టి ఏడుకొండలు, గుంటూరు వెంకటేశ్వరరావు, ఆకుల సాంబయ్య, ఆకుల కోటేశ్వరరావు, ఆకుల సదా, ఆకుల నరసింహరావు, పసుపులేటి సుబ్బారు, వైకుంఠపురం శంకర్, పోతురాజు, వెంపటి భాస్కరరావు, గుంటూరు బూసి, వెంపటి శ్రీను, టైలర్ రమేష్ తదితర టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డు.. భక్తులకు పాట్లు

● ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నా పట్టించుకోని అధికారులు



గుంతలమయంగా ఉన్న అమ్మవారి ఆలయానికి వెళ్లే రహదారి

దుర్గి, మార్చి 21 : మండలంలోని అడిగొప్పుల శివారులో ఉన్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీంతో భక్తులు దేవస్థానానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా వెళ్తుంటారు. రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించబోయి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం వందలాది టిప్పర్ల ద్వారా అక్రమంగా మట్టిని తరలించడం వలనే రోడ్లపై గుంతలు ఏర్పడుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. అమ్మవారి దేవస్థానం సమీపంలో ఉన్న అందమైన కొండలను విచ్చలవిడిగా తవ్వేస్తూ మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తూ కోట్లాది రూపాయలను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ తవ్వకాలు చేసే వారికి రాజకీయ అండదండలు మెండుగా ఉండడంతో అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని విమర్శిస్తున్నారు. ప్రతియేటా అమ్మవారి తిరునాళ్ల వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ తిరునాళ్లకు సుదూర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులను తీర్చుకుంటారు. అమ్మవారి కుంకుమబండ్లతో దేవస్థానానికి చేరుకుంటారు. ఈనెల 24వ తేదీన ఈ తిరునాళ్ల జరగనుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రోడ్లకు మరమ్మతులు నిర్వహించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు వేడుకుంటున్నారు.



భాష్యం ప్రవీణ్‌ను పరిచయం చేస్తున్న బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు సుధాకర్‌బాబు

భాష్యం ప్రవీణ్ గెలుపునకు సంపూర్ణ మద్దతు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్

అమరావతి, మార్చి 21 : టీడీపీ అభ్యర్థిగా పెదకూరపాడు నియోజకవర్గంలో పోటీ చేస్తున్న భాష్యం ప్రవీణ్ గెలుపునకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు అన్నారు. స్థానిక ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన బీజేపీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌ను ఆహ్వానించి బీజేపీ నాయకులు, కార్యకర్తలకు పరిచయం చేశారు. సుధాకర్‌బాబు మాట్లాడుతూ బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి రాష్ట్రంలో అధికారం సాధించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వైసీపీ తన సొంత కార్యక్రమాలుగా ప్రకటించుకుని మోసం చేస్తుందన్నారు. టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల మధ్య సమన్వయం, సమష్టి కృషి అవసరమని, దానికి ప్రాధాన్యం ఇచ్చి కూటమి అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కె.శ్రీనివాస్ యాదవ్, తమ్మా వెంగళరెడ్డి, హనుమంతురావు, మేకల వెంకటేశ్వరరావు, మద్ది ధాత్రినారాయణ, కె.వెంకటేశ్వరరావు టీడీపీ నాయకులు కె.వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కస్తలలో మన ఇంటికి.. మన భాష్యం ప్రవీణ్

అచ్చంపేట, మార్చి 21 : మండలంలోని కస్తల గ్రామంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మన ఇంటికి మన భాష్యం ప్రవీణ్ అనే కార్యక్రమం జరుగుతుందని అచ్చంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం గురువారం తెలిపారు. కస్తలలో జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ కుటుంబ సభ్యులు తదితరులు ఎన్నికల ప్రచారం నిమిత్తం రానున్నారని తెలిపారు.

అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపాలి : వెన్నా

బెల్లంకొండ, మార్చి 21 : రాష్ట్రంలో వైసీపీ అవినీతి ప్రభుత్వాన్ని వెంటనే గద్దె దింపాలని గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబ శివారెడ్డి అన్నారు. బెల్లంకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురు వారం టీడీపీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. వెన్నా సాంబశివారెడ్డి మాట్లాడుతూ అవినీతి, ఇసుక, మట్టి మాఫియా ప్రభుత్వాన్ని వెంటనే బంగాళాఖాతంలో కలపాలని ఆయన సూచించారు. నరసరావుపేట ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలను, పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌ను మంచి మెజార్టీతో గెలిపించాలని సూచించారు. సమావేశంలో తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షుడు భాష్యం నరసయ్య, పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గుంజా గంగారావు, జ్యోతి సముద్రం, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, బాషా, పీఎస్‌కే రసూల్, ఎన్.పిచ్చయ్య, తెలుగు యువత అధ్యక్షుడు సలాం, ముస్తఫా, చిట్టి, గుడిసె కొండయ్య, రామకృష్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి

నేడు క్రోసూరులో భాష్యం ప్రవీణ్ ఆత్మీయ సమావేశం

బెల్లంకొండ, మార్చి 21 : పెదకూరపాడు టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ బెల్లంకొండ మండల టీడీపీ నాయకులతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ అన్నారు. ఈ సమావేశానికి టీడీపీ మండల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ లెవల్ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

లిఫ్ట్ గుంతలో పడి బాలిక మృతి

గుంటూరు, మార్చి 21 : స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద పలకలూరు-మల్లవరం గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న ఓ కళాశాల అపార్ట్‌మెంట్ లిఫ్ట్ గుంతలో పడి అమృత (6) అనే బాలిక మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కారంపూడి మండలం పేటసన్నె గండ్ల గ్రామానికి చెందిన మద్దు అశోక్‌కుమార్, సారిక దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు పిల్లలతో కలసి పది రోజుల క్రితం కూలి పనుల నిమిత్తం పెదపలకలూరు గ్రామానికి వచ్చారు. గ్రామ శివారులోని ఓస్మాలుకు వెళ్లే డొంకరోడ్డులో హైదరాబాద్‌కు చెందిన సీతారామి రెడ్డి నిర్మిస్తున్న కళాశాల అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులు చేస్తున్నారు. అందులో లిఫ్ట్ కోసం తవ్విన గుంతలో నీరు నిల్వ చేసి అపార్ట్‌మెంట్ నిర్మాణానికి వాడుకుంటున్నారు. అయితే పది రోజుల నుంచి అశోక్ కుటుంబంతో సహా అక్కడే పరదాలతో ఒక చిన్న గూడు కట్టుకుని నివాసం ఉంటున్నారు. కాగా గురువారం ఉదయం సుమారు 8.30కి అశోక్‌కుమార్ దంపతులు అక్కడే ఉన్న మరో బ్లాక్‌లో పనికి వెళ్లారు. అయితే వారి కుమార్తె అమృత ఆడుకుంటూ లిఫ్ట్ గుంతలో పడిపోయింది. అమృత జాడ లేకపోవడంతో తల్లిదండ్రులు ఆమెను వెతుకు తూ ఆ గుంత వద్దకు వెళ్లగా బాలిక అందులో కనిపించింది. వెంటనే బాలికను బయటకు తీసి ఆసుపత్రికి తీసుకువెళ్ళగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నల్లపాడు సీఐ నరేష్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరి శీలించారు. తండ్రి అశోక్‌కుమార్ ఫిర్యాదు మేరకు నల్లపాడు సీఐ నరేష్‌కు మార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల అభ్యున్నతికి మహాశక్తి వరాలు : నూర్జహాన్

పెదకూరపాడు, మార్చి 21 : టీడీపీ వ్యవస్థాపకుడు చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన మహాశక్తి ద్వారా మహిళా అభ్యున్నతితో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ జిల్లా నాయకురాలు పఠాన్ నూర్జహాన్ అన్నారు. మండలంలోని కాశిపాడులో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైసీపీ పాలనలో ఆడపిల్లలకు రక్షణలేకుండా పోయిందని, టీడీపీ గెలిస్తేనే మహిళలకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. సూపర్-6, భవిష్యత్ గ్యారెంటీ వంటి పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భాష్యం ప్రవీణ్ కుటుంబ సభ్యులు శివరంజని, పద్మావతి, అరుణ, సౌజన్య, మాజీ ఎంపీపీ పాటిబండ్ల శివమ్మ, టీడీపీ రాష్ట్ర, జిల్లా నేతలు గంగినేని లీలావతి, షేక్ ముంతాజ్, సరిపూడి కృష్ణ కుమారి, కోంద్రు పద్మలత, కావూరి సుజాత, నాదెండ్ల కల్పన, గుమ్మడి పుష్పలత తదితరులు ఉన్నారు.



కాశిపాడులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా నాయకురాలు నూర్జహాన్

చిలకలూరిపేట మునిసిపల్ కమిషనర్ పై చర్యలు తీసుకోవాలి

క్రోసూరు, మార్చి 21 : చిలకలూరిపేట మునిసిపల్ కమిషనర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి దాసు డిమాండ్ చేశారు. ఆయన క్రోసూరులో గురువారం విలేకరులతో మాట్లాడుతూ తమ కమిటీ సభ్యుడు కోట సుబ్బు మాదిగ దళిత సమస్యలపై విజ్ఞాపనలు సమర్పించేందుకు కమిషనర్ వద్దకు వెళ్ళగా ఆయన అనుమతించకపోవటంతో పాటు నానా దుర్భాషలాడారని ఆరోపించారు. దీంతో సుబ్బు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయటానికి వెళితే వారు కూడా ఫిర్యాదు తీసుకోవటానికి నిరాకరించారని దాసు అన్నారు. కమిషనర్‌పై కలెక్టర్‌కు, ఎలక్షన్ కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేస్తున్నామన్నారు. సమావేశంలో కమిటీ జిల్లా అధ్యక్షుడు మరియదాసు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నికలపై శిక్షణ కార్యక్రమం

పెదకూరపాడు, మార్చి 21 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించి శిక్షణా కార్యక్రమాన్ని పెదకూరపాడు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి కందుల శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెక్టారల్ అధికారి, పోస్టల్ బ్యాలెట్ టీమ్స్, హోమ్ ఓటింగ్ టీమ్స్ వారికి శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ జే.ప్రభాకరరావు, అమరావతి తహసీల్దార్ వెంకట రమణ, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



రొంపిచర్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వర్మ

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు

● డీఎస్పీ వర్మ

రొంపిచర్ల, మార్చి 21: రాబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ వర్మ గురువారం తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. రొంపిచర్ల, కొనకంచివారిపాలెం, గోగులపాడు, అలవాల, తురుమెళ్ళ, సుబ్బయ్యపాలెం, ఎడ్వర్డుపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సీఆర్‌పీఎఫ్ బలగాలతో పోలీసు కవాతు నిర్వహించామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ పాల్‌రాజు రవీంద్ర పాల్గొన్నారు.

ముందస్తు ప్రవేశాలు చేపడితే కళాశాలలపై చర్యలు

● డీవైఈవో నీలావతి దేవి

నరసరావుపేట టౌన్, మార్చి 21: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ముందస్తు ప్రవేశాలు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పూర్తికాకుండానే చేపట్టిన ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై కఠినచర్యలు తీసుకొంటామని డీవైఈవో ఎం నీలావతిదేవి గురువారం తెలిపారు. ఇంటర్మీయట్ విద్యామండలి 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తుందన్నారు. ఆ షెడ్యూల్ ప్రకారమే అడ్మిషన్లు చేసుకోవాలని, అన్ని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యానికి తెలియజేస్తున్నామన్నారు. అడ్మిషన్ నోటిఫికేషన్ కంటే ముందే ప్రవేశాలు తీసుకున్నట్లు ఫిర్యాదులు అందితే జూనియర్ కళాశాల గుర్తింపు రద్దుకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్య, అధ్యాపకులు

ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

నరసరావుపేట టౌన్, మార్చి 21: స్థానిక కేసానుపల్లిలో ఉన్న ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో ఒమేగా హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో మెడికల్ కోడింగ్ విభాగంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారని కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు గురువారం తెలిపారు. ఒమేగా హేల్త్‌కేర్ లీడ్ హెచ్ఆర్ విజయశేఖర్ ఈ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. 26మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు వార్షికవేతనం రూ.2.20లక్షలు ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రవితేజ, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ చందన, అధ్యాపకులు అభినందించారు.

ఏఆర్ ఏఎస్పీకి ఉత్తమ సేవా పతకం

నరసరావుపేట లీగల్, మార్చి 21: పల్నాడు జిల్లా ఏఆర్ ఏఎస్పీ రామచంద్రరాజుకు రాష్ట్ర ప్రభుత్వం 2024 సంవత్సరం ఉత్తమ సేవ పురస్కారాన్ని ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వారికి పురస్కారాలు అందజేస్తుంది. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకరరెడ్డి సిఫార్సు మేరకు రామచంద్రరాజుకు ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయనను పలువురు పోలీసు అధికారులు అభినందించారు.

జాతీయ రహదారిపై ప్రమాదం

● ఆటోను, స్కూటీని ఢీకొట్టిన కారు
● ఐదుగురికి గాయాలు



సంఘటన స్థలంలో పడి ఉన్న స్కూటీ, పాక్షికంగా దెబ్బతిన్న ఆటో, పక్కన ఢీకొట్టిన కారు, ప్రమాదంలో గాయపడిన మతిరియానాయక్

తిమ్మాపురం (యడ్లపాడు), మార్చి 21: పదహారో నంబరు జాతీయ రహదారిపై యడ్లపాడు మండలం తిమ్మాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. అదుపుతప్పిన కారు అతివేగంతో స్కూటీని మరో రెండు ఆటోలను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా మార్టూరుకు చెందిన 73ఏళ్ళ వృద్ధుడు మతిరియానాయక్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనుమడు వినోద్ అతని స్నేహితుడు సామియేలు, కుమార్తె పద్మ, భార్య గోల్డిబాయిలతో కలసి ఆటోలో గురువారం ఉదయం గుంటూరుకు వచ్చిన ఆయన ఆసుపత్రిలో చూపించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. తిమ్మాపురం పరిధిలోని తిరుమల ఆయిల్ మిల్లు సమీపంలోకి రాగానే గుంటూరు నుంచి చిలకలూరిపేటవైపు వస్తున్న ఏపీ39టీబీ 3084 నంబరు కారు తొలుత స్కూటీని, అనంతరం ఆటోను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మతిరినాయక్ తీవ్రంగా గాయపడగా భార్య గోల్డిబాయి, కుమార్తె పద్మ, వినోద్ స్నేహితుడు సామియేలుతోపాటు, స్కూటీపై ప్రయాణిస్తున్న వ్యక్తి గాయపడ్డారు. గాయపడిన వారిని 108 సిబ్బంది ఆంబులెన్స్‌లో చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కారు డ్రైవర్ షేక్ కరిముల్లా మద్యం సేవించి అతివేగంగా నడపడంతో కారు అదుపుతప్పి ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు.

సంఘటన స్థలానికి చేరుకున్న హైవే పెట్రోలింగ్ ఏఎస్ఐ కొండలు, కానిస్టేబుల్ చంద్రమోహన్‌లు కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోవడంతో పాటు ప్రమాదానికి గురైన వాహనాలను స్టేషన్‌కు తరలించారు. యడ్లపాడు పోలీసులు కేసు నమోదుచేసుకుని దరాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు సహకరించాలి: ఎంఈవో

శావల్యాపురం, మార్చి 21: దివ్యాంగుల సంక్షేమాన్ని కర్తవ్యంగా భావించి ప్రజలంతా తమవంతు సహకారం అందించాలని ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. స్థానిక భవిత పాఠశాలలో వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులతో కేకును కట్ చేయించి ఆటల పోటీలను నిర్వహించారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు బిళ్లా రాజారమేష్ పాఠశాలలోని దివ్యాంగులకు అన్నదానం చేశారు. ఎంఈవోలు సాంబశివరావు, లలితకుమారి పాల్గొని మాట్లాడుతూ క్రోమోజోమ్స్ లోపంతో బాధపడుతున్న దివ్యాంగులకు ప్రభుత్వం వికలాంగ సర్టిఫికెట్లు ఇచ్చి పింఛన్లను అందజేస్తుందన్నారు. ఈ ఏడాది భవితపాఠశాల నుంచి నలుగురు డౌన్ సిండ్రోమ్ విద్యార్థులు పది పరీక్షలు రాయబోతున్నారని, వారు ప్రతి సబ్జెట్‌లో 10మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులవుతారన్నారు. అనంతరం అన్నదానం చేసిన రాజారమేష్‌ను ఎంఈవోలు అభినందించారు. భవిత ఉపాధ్యాయులు జగన్మోహన్‌రెడ్డి, పార్వతి, ఎంఆర్సీ సిబ్బంది లింగాల శ్రీహరి, మస్తాన్, ఎలికా శ్రీనివాసరావు, ఏడుకొండలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

23న వాగ్దేవి డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

నరసరావుపేట టౌన్, మార్చి 21: పట్టణంలోని రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఈ నెల 23, శనివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాదు గురువారం తెలిపారు. మొత్తం 20 కంపెనీలలో వేయికి పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు అన్నారు. జాబ్ మేళాలో ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఫార్మసీ, డిగ్రీ చదవిన వారు పాల్గొనవచ్చన్నారు. ఉదయం 9 గంటలకు పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు రూ.1.50లక్షల నుంచి రూ.4.20లక్షల వరకు వార్షిక వేతనం ఉంటుందన్నారు. అదనపు సమాచారం కోసం 8121212873, 9247025166 నంబర్లను సంప్రదించాలన్నారు.

పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

● సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి మోహన్‌చంద్

శావల్యాపురం, మార్చి 21: జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు 2024-25 విద్యాసంవత్సరానికిగాను ప్రైవేటు పాఠశాలలో చదివేందుకు ఆసక్తి కలిగిన పేద విద్యార్థులు ముందుగా సీట్లకోసం దరఖాస్తులు చేసుకోవాలని సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కేవీఆర్ మోహన్ చంద్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యాహక్కుల చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలలో 25శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సి ఉందని, ప్రభుత్వం రూపొందించిన వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సుచరిత ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న శావల్యాపురంలోని శ్రీరామ పబ్లిక్ స్కూల్లో చేరేందుకు ఆసక్తి కలిగిన పేదవిద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ రత్నకుమారి, డైరెక్టర్ అజిత్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.



రొంపిచర్లలో సూపర్-6 పథకాలపై ప్రచారంలో పాల్గొన్న గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు

టీడీపీ మేనిఫెస్టోపై ప్రచారం

రొంపిచర్ల, మార్చి 21: నిరుద్యోగం పోవాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో సూపర్-6 పథకాలపై బుధవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు రక్షణ తెలుగుదేశం పార్టీతో సాధ్యమన్నారు. రాజధాని అమరావతిగా ఉండాలంటే చంద్రబాబును గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, వడ్లమూడి కిషోర్, నెల్లూరి పాపారావు, దేనువుకొండ సాంబశివరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈపూరు మండలంలో..

ఈపూరు, మార్చి 21: రాష్ట్రాభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమిని గెలిపించాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావర్ల జగ్గారావు అన్నారు. మండలంలోని బొమ్మరాజుపల్లిలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు గురించి తెలియజేస్తున్న పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గన్నమనేని వెంకయ్య, బెల్లంకొండ సైదులు, కాటం కోటేశ్వరరావు, నరసింహారావు, శ్రీను, బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

జైభీమ్‌రావ్ భారత పార్టీని ఆదరించాలి

● పార్లమెంట్ అభ్యర్థి కూచిపూడి జాన్‌బాబు

నరసరావుపేట టౌన్, మార్చి 21: జైభీమ్‌రావ్ భారతపార్టీని ఆదరించాలని పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కూచిపూడి జాన్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం నరసరావుపేట పట్టణంలో జైభీమ్‌రావ్ భారతపార్టీ నాయకుల మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కూచిపూడి జాన్‌బాబు మాట్లాడుతూ పార్టీ అధినేత జడ శ్రావణ్‌కుమార్ ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను, పార్లమెంట్ అభ్యర్థిని ప్రకటించారన్నారు. కోటు గుర్తుకి ఓటు వేయలాని విజ్ఞప్తి చేశారు. నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థి గోదా జాన్ పాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు రాక్షస పాలన కొనసాగిందని అన్నారు. కార్యక్రమంలో గురజాల అభ్యర్థి జూలూరి రమేష్, మాతంగా సుధాకర్, జంగా జోజియా, గోదా బాల, సేవా చంద్ర, జీ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్టు

పొన్నూరు టౌన్, మార్చి 21: కోడి పందేలు నిర్వహిస్తున్న పద్నాలుగు మందిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ వై కోటేశ్వరరావు తెలిపారు. కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సీఐ కోటేశ్వరరావు ఎస్ఐ బండ్ల భార్గవ్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. మండల పరిధిలోని మాచవరం గ్రామం టీబీ డ్రెయిన్ కట్టపై సోదాలు నిర్వహించగా కోడిపందేలు ఆడుతున్న 14మంది జూదరులను అరెస్టుచేసి వారివద్ద నుంచి 33వేల నగదు, ఆరు కోడిపుంజులు, 16కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



మొక్కలు నాటుతున్న జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు

ఘనంగా ప్రపంచ అటవీశాఖ దినోత్సవం

వినుకొండ, మార్చి 21: ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గంగినేని కల్యాణి డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా అటవీ శాఖ అధికారి యస్.రామచంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డీఎఫ్‌వో రామచంద్రరావు విద్యార్థినీ, విద్యార్థులతో మాట్లాడుతూ మానవ మనుగడకు చెట్లు ఎంతో ప్రాముఖ్యమైనవన్నారు. గాలినిచ్చే చెట్లను, పర్యావరణాన్ని మనం కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చెట్లు అడవి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాలల్లో మొక్కలు నాటి వెల్లటూరు రోడ్డులోని అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న నగరవనాన్ని సందర్శించారు. శరవేగంగా జరుగుతున్న పనులను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి సురేంద్రబాబు, బీట్ ఆఫీసర్ టి.సురేంద్రబాబు, అటవీశాఖ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'సంగం' పాలసేకరణ ధర పెంపు

● వినుకొండ సంగం డెయిరీ మేనేజర్ నాగప్రభు

శావల్యాపురం, మార్చి 21: పాడి రైతుల సంక్షేమం కోసం అనేక రకాల రాయితీలు, బోనస్‌లు, ఉచిత పశువైద్యసేవలను అందిస్తున్న సంగం డెయిరీ పాలసేకరణ ధరను ఎప్పటికప్పుడు పెంచుతూ వారి ఆర్థికాభివృద్ధికి ఎంతో తోడ్పాటునందిస్తుందని వినుకొండ సంగం డెయిరీ మేనేజర్ కొత్తపల్లి నాగప్రభు అన్నారు. శావల్యాపురంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు పాడి రైతులు పోసిన పాలకు 10 వెన్నశాతం వస్తే ఒక్కో లీటరుకు రూ.80లను గరిష్ట ధరగా నిర్ణయించడం జరిగిందన్నారు. వినుకొండ పరిధిలో సంగం డెయిరీకి రోజుకు 74వేల లీటర్ల పాలను సేకరిస్తున్నామని, వినుకొండ కేంద్రానికి 52వేలు, రవ్వారం బల్క్ కేంద్రానికి 12వేలు, గణపవరం కేంద్రానికి 10వేల లీటర్ల పాలు వస్తున్నట్లు తెలిపారు. పాలఉత్పత్తిదారులకు ప్రమాదభీమా పథకంతో వైద్యశాలను నిర్మించి ఉచిత వైద్యసేవలను కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు.

అడవులను రక్షించుకొందాం: హెచ్ఎం గురులింగం

నరసరావుపేట రూరల్, మార్చి 21: అడవులను రక్షించుకొందాం మన భవిష్యత్తుని కాపాడుకొందాం అని ప్రధానోపాధ్యాయులు గురులింగం పిలుపునిచ్చారు. మండలంలోని కేశానుపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్ఆర్‌కేటీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ అటవీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గురులింగం మాట్లాడుతూ భూమిపై జీవన చక్రాన్ని సమతుల్యం చేయడానికి అడవులు విలువలు, ప్రాముఖ్యత సహకారం గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం మార్చి 21న ప్రపంచ అటవీ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. భూమిపై 31 శాతం అడవులు ఉన్నాయని అడవులు మనకు ఆక్సిజన్, ఆశ్రయం, ఉద్యోగాలు, నీరు, పోషణ, ఇంధనాన్ని అందిస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గాదెపై అసత్య ఆరోపణలు తగదు

● వినుకొండ జనసేన పార్టీ నాయకులు

వినుకొండ, మార్చి 21: సత్తెనపల్లి జనసేన పార్టీ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావుపై అసత్య ఆరోపణలు తగదని పట్టణ జనసేన పార్టీ ముఖ్యనాయకులు అన్నారు. స్థానిక వెల్లటూరు రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లడుతూ 2014లో పార్టీ స్థాపించిన నాటి నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలో పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు విశేష కృషిచేసిన వ్యక్తి, 17నియోజకవర్గాల్లో కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చిన అర్ధరాత్రి కూడ స్పందించే వ్యక్తి, ఉమ్మడి జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటనలు చేస్తూ కమిటీలు వేస్తూ నిరంతరం పార్టీ బలోపేతం కోసం ఆలోచించే వ్యక్తి గాదె వెంకటేశ్వరరావు అన్నారు. అటువంటి నాయకుడు మీద పార్టీలోని కొంతమంది వ్యక్తులు వారి స్వార్ధ ప్రయోజనాల కోసం చేసే అసత్య ఆరోపణలుగా భావిస్తున్నామన్నారు. పార్టీ ప్రతిష్ట దెబ్బతినే విధంగా ఎవరైన బహిరంగ వ్యాఖ్యలు చేస్తే వారికి అదే రీతిలో సరైన సమాధానం చెప్పాల్సి వస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

సాంకేతిక బోధనపై కేంద్ర బృందం పరిశీలన



వెనిగండ్ల జడ్పీ పాఠశాలలో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్, విద్యాశాఖ అధికారులు

గుంటూరు (విద్య), పెదకాకాని, మార్చి 21: ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సాంకేతిక విద్యాబోధనకు 'ప్రైమ్ మినిస్టర్ ఎక్సలెన్స్' అవార్డుకు ఆంధ్రప్రదేశ్ ఎంపికైంది. అవార్డు ప్రదానం చేసే ముందుగా ఇద్దరు అధికారులతో కూడిన కేంద్ర బృందం గురువారం జిల్లాలోని పాఠశాలల్లో క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చింది. ఈ సందర్భంగా పాఠశాలల్లో క్షేత్రస్థాయిలో బోధన తీరు, తెన్నులను పరిశీలించేందుకు కేంద్ర డిప్యూటీ కార్యదర్శులు ఆశిష్ సక్సేనా, హరీష్ రాయ్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ గురువారం గుంటూరు జిల్లాలోని పెదకాకాని మండలం వెనిగండ్ల జడ్పీ హైస్కూల్, గుంటూరు చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, పట్టాభిపురంలోని నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ), బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల ద్వారా జరుగుతున్న బోధనను కేంద్ర అధికారులు పరిశీలించారు. ఇంజనీరింగ్ విద్యార్థులను పాఠశాలలకు అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన 'ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్' కార్యక్రమాన్ని పరిశీలించిన అధికారులు విద్యార్థులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. టీం వెంట సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి, ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, డీఈవో పి.శైలజ, సీఎస్ఈ ఐటీ సెల్ ప్రతినిధి రమేష్ పాల్గొన్నారు.



శ్రీకృష్ణ దేవరాయలను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసిచూపిస్తా

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నాదెండ్ల, మార్చి 21: రాబోయే ఎన్నికల్లో తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని సాతులూరు గ్రామంలోని పార్టీ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులతో బుధవారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల్లో నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో తానుచేసిన అభివృద్ధి పనులు ప్రతి ఒక్కరికీ తెలుసు అన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధిచేసి చూపించానన్నారు. రాబోయే ఎన్నికల్లో తనను గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు తెచ్చి అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తానన్నారు. సూపర్-6 పథకాలపై కార్యకర్తలు ప్రచారం నిర్వహించాలన్నారు. ఎన్నికలకు సమయం ఉన్నందున గ్రామాలను ఎంపిక చేసుకొని ముఖ్యులను కలవటంతో పాటు ప్రచారానికి సమయం కేటాయిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పరిచయం చేసుకోవటంతో పాటు సత్కరించారు.

తూనికల్లో తేడాలు: 47 కేసుల నమోదు

చిలకలూరిపేట, మార్చి 21: తూనికలు, కొలతల శాఖ అధికారులు గురువారం పట్టణంలో ఆకస్మిక తనిఖీలు జరిపారు. రైస్ మిల్లులు, బంగారం షాపులు, కూరగాయల దుకాణాలు, పలు ఇతర చోట్ల వారు తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో చట్టవిరుద్ధంగా జరుగుతున్న కొన్నివ్యవహారాలను గుర్తించారు. తూనికాల్లో తేడాలు గుర్తించారు, దీనిపై 47 కేసులు వారు నమోదు చేశారు.

గిరిజనులపై వైసీపీ హత్యా రాజకీయాలు

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్

నరసరావుపేట టౌన్, మార్చి 21: గిరిజనులపై వైసీపీ హత్యారాజకీయాలు చేస్తోందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.దారునాయక్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రకాశం జిల్లా గిద్దలూరులో టీడీపీ కార్యకర్త మునయ్యను వైసీపీ గూండాలు గొడ్డలితో నరికి చంపటం దుర్మార్గం అన్నారు. సొంత బాబాయిని గొడ్డలితో చంపిన నాయకుల్ని వైసీపీ కార్యకర్తలు ఆదర్శంగా తీసుకున్నారన్నారు. అధికారం కోల్పోతున్నామన్న అక్కసుతో వైసీపీ రాక్షసమూకలు నరమేధం సాగిస్తున్నాయని మండిపడ్డారు. టీడీపీ గిరిజన యానాది సామాజికవర్గ నాయకుడు పాముల మునయ్య హత్యను తీవ్రంగా ఖండించారు. చిలకలూరిపేట బొప్పూడి ప్రజాగళం సభకు పెద్దఎత్తున జనాన్ని తరలించాడన్న అక్కసుతో వైసీపీ రాక్షసమూకలు గొడ్డలితో మునయ్యను నరికి చంపారన్నారు. ఎన్నికల సంఘం వైసీపీకి ఫ్యాన్ గుర్తు రద్దుచేసి గొడ్డలి గుర్తు కేటాయించాలన్నారు. మునయ్యను హత్యచేసిన వారిపై, వారి వెనుక ఉన్న నాయకులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వానికి గిరిజనులు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని, పాముల మునయ్య కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు.



డీఈవో ఎం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి

డీఈవోకు యూటీఎఫ్ నాయకుల వినతి పత్రం

నరసరావుపేట టౌన్, మార్చి 21: పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలని యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పీ ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జీ విజయసారధి డిమాండ్ చేశారు. గురువారం పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో ఎం వెంకటేశ్వర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూల్యాంకన విధులు కేటాయింపులో సీనియారిటీ పాటిస్తూ అర్హులైన వారికి న్యాయం చేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, హృద్రోగులు, గర్భిణులు, బాలింతలు, పదవీ విరమణకు అతి దగ్గరగా ఉన్నవారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

అనారోగ్యంతో ఎంపీటీసీ రాజేశ్వరి మృతి



పాటిబండ్ల రాజేశ్వరి (పాత చిత్రం)

నాదెండ్ల, మార్చి 21: మండలంలోని సాతులూరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ - 2 సభ్యురాలు పాటిబండ్ల రాజేశ్వరి (65) గురువారం ఉదయం మృతిచెందారు. కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె నరసరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఆమె భర్త రఘుపతిబాబు 2011 డిసెంబరులో శబరిమల వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆమెకు ఇద్దరు కుమారులు. ఆమె భౌతికకాయాన్ని వైసీపీ సమన్వయకర్త కావటి శివనాగ మనోహర్ నాయుడు, జడ్పీటీసీ కే మస్తాన్‌రావు, ఎంపీపీ తలతోటి రాణి, ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, మాజీ సర్పంచ్ పోపూరి వింధ్యారాణి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

మోటార్ బైక్‌లు ఢీ: ఒకరికి తీవ్రగాయాలు

ఈపూరు, మార్చి 21: ఎదురెదురుగా రెండు మోటార్ బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని కొండ్రముట్ల వద్ద గురువారం సాయంత్ర చోటుచేసుకుంది. కొచ్చెర్ల గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు మోటార్ బైక్‌పై బొల్లాపల్లి మండలంలో రొట్టెలు, బిస్కెట్లు అమ్ముకొని స్వగ్రామం కొచ్చెర్ల వస్తుండగా కొండ్రముట్ల వద్ద ఎదురుగా నకరికల్లు మండలానికి చెందిన నాగరాజు నాయక్ మోటార్ బైక్‌పై బొల్లాపల్లి వైపు వెళ్తూ ఢీకొట్టాడు. ఆ సమయంలో నాగరాజునాయక్ మద్యం సేవించి ఉన్నాడు. ప్రమాదంలో శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వినుకొండ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీనివాసరావును గుంటూరు ఆసుపత్రికి తరలించినారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి పన్నులు 100 శాతం వసూలు చేయాలి: డీఎల్‌పీవో



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

వినుకొండ టౌన్, మార్చి 21: గ్రామాల్లో ఇంటి పన్ను బకాయిలు మార్చి 31లోపు 100శాతం వెంటనే వసూలు చేయాలని డీఎల్‌పీవో రమణయ్య పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం పంచాయతీ సెక్రటరీలతో గురువారం ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో ఇప్పటివరకు 50శాతం పన్ను వసూలు కాలేదని, ఇప్పటికైనా పన్నుల వసూళ్ళపై శ్రద్ధ చూపాలని, నెల ఆఖరిలోపు పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుందర్ రామిరెడ్డి, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.